INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

గురువారం 22.08.2024

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 32 సంచిక - 185 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

# నేరస్తుల తాట తీయండి

- రాష్ట్రంలో పోలీసింగ్‌లో స్పష్టమైన మార్పు కనిపించాలి
- నేరం చేస్తే శిక్ష తప్పదనే భయం కల్పించేలా పోలీసు శాఖ పని చేయాలి
- శాంతి భద్రతల విషయంలో రాజీలేదు....పోలీసు సిబ్బందిలో అలసత్వాన్ని సహించేది లేదు
- ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడితే అదే వారికి చివరి రోజు కావాలి
- విచారణలో పోలీసులు ఆలస్యం చేస్తే నేనే ఘటనా స్థలానికి వెళతా!
- డ్రంక్ అండ్ డ్రైవ్ పై కఠినంగా వ్యవహరించండి....గంజాయి, డ్రగ్స్ తరిమేయండి
- ఏపి పోలీసు శాఖ ప్రతిష్ఠ మళ్లీ నిలబెడదాం...ప్రజల భద్రతకు భరోసా ఇద్దాం
- హెూం శాఖలో రివ్యూలో నారా చంద్రబాబు నాయుడు
- 2014-19 పోల్చితే 2019-24 లో క్రైం రేట్ 46 శాతం పెరిగిందన్న అధికారులు
- పోలీసు శాఖలో మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక ఇబ్బందులు తొలగించేందుకు నిధుల విడుదలకు ముఖ్యమంత్రి ఆదేశం




**అమరావతి:** రాష్ట్రంలో పోలీసింగ్ లో స్పష్టమైన మార్పు కనిపించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నేరం చేస్తే శిక్ష తప్పుదు అనే భయం కనిపించేలా పోలీసు శాఖ పనిచేయాలని సీఎం అన్నారు. నేరం జరిగిన తరువాత నేరస్తులను పట్టుకోవడం, శిక్షించడం ఒక ఎత్తు అయితే...అసలు నేరం చేయాలంటేనే భయపడే పరిస్థితి కల్పించాలని సిఎం అన్నారు. ప్రజల భద్రతకు ఒక భరోసా ఇచ్చేలా పోలీసు శాఖ పనిచేయాలని.... పూర్తి స్థాయి శాంతి భద్రతలతో మళ్లీ ప్రశాంతమైన రాష్ట్రంగా ఏపీ కనిపించాలని సీఎం అన్నారు. రాజకీయ ముసుగులో ఎవరైనా అరాచకాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలని సీఎం అన్నారు. శాంతి భద్రతలు కాపాడే విషయంలో, నేరాల విచారణ, నేరస్తులకు శిక్షల విషయంలో అధికారులు ఫలితాలు కనిపించేలా పనిచేయాలని సూచించారు. హెూం శాఖపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష చేశారు. హెూంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ ద్వారకా తిరుమల రావుతో పాటు పోలీసు శాఖలోని ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**గత ప్రభుత్వంలో 46 శాతం పెరిగిన నేరాలు**

సచివాలయంలో జరిగిన ఈ సమీక్షలో గత పదేళ్లలో పోలీసు శాఖలో నెలకొన్న పరిస్థితులపై అధికారులు వివరించారు. 2014-19 పోల్చితే 2019-24లో క్రైం రేట్ 46 శాతం పెరిగిందని అధికారులు వివరించారు. 2014-19 తో పోల్చుకుంటే 2019-23 మధ్యకాలంలో మహిళలపై నేరాలు 35.91 శాతం, మహిళల అదృశ్యం కేసులు 84.83 శాతం, సైబర్ నేరాలు 134.43 శాతం పెరిగాయని తెలిపారు. అలాగే గంజాయి, డ్రగ్స్ కేసులు 107.89 శాతం, చిన్న పిల్లలపై నేరాలు 151.88 శాతం పెరిగాయని వెల్లడించారు. గత ప్రభుత్వ తీరుతో పోలీసు శాఖ ఎలా నిర్వీర్యమైందో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పోలీసు శాఖలో ఆయా విభాగాలకు ఇవ్వాల్సిన చిన్న చిన్న ఆర్థిక మొత్తాలను కూడా చెల్లించకపోవడం వల్ల పోలీసులు, పోలీసు శాఖ ఎదుర్కొన్న ఇబ్బందుల

2 లో

# సంపద సృష్టిస్తున్న బాబు



**పొలిటికల్ డెస్క్ (జర్నలిస్ట్ ఫైల్):** సంపద అంటే ఏమిటి చేతిలో డబ్బు ఆడడం. అంతే కాదు ఉన్న రూపాయి ఖర్చు కాకుండా జాగ్రత్త చేయడం. ఇలా రెండిందాలుగా సంపద సృష్టి జరుగుతుంది. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్నపుడు సభల్లో మాట్లాడుతూ తాను సంపద సృష్టించి అభివృద్ధి సంక్షేమం రెండూ అందిస్తాను అని చెప్పేవారు. దానిని ఆనాటి అధికార వైసీపీ నేతలు ఎద్దేవా చేసేవారు.

అయితే చంద్రబాబు కొత్త రూపాయిని సృష్టించేందుకు ప్రయత్నాలు అయితే మొదలెట్టారు. ఫలితాలు రావడానికి చాలా టైం పడుతుంది. అయితే అదే సమయంలో బాబు రెండో మార్గాన ఉన్న రూపాయి జారిపోకుండా జాగ్రత్త పడుతున్నారు. అదే సమయంలో సంక్షేమం అభివృద్ధి విషయాల్లో ప్రయారిటీ ప్రాతిపదికన డెసిషన్స్ తీసుకుంటున్నారు.

ఏపీలో అన్నా క్యాంటీన్లను చంద్రబాబు ఇటీవల ప్రారంభించారు. వాటిని వంద దాకా ఓపెన్ చేశారు. మరో వంద కూడా రానున్న రోజులలో స్టార్ట్ చేస్తారు. దీనికి ఏటా అయ్యే ఖర్చు 250 కోట్ల రూపాయలు అయితే ఇక్కడే బాబు తెలివిగా ఆలోచిస్తున్నారు. అన్నా క్యాంటీన్ల నిర్వహణ భారం ప్రభుత్వం మీద పడకుండా శాశ్వతంగా అవి తమ మానాన నడిచేలా ఆయన ధనవంతులను పిలిచి మరీ విరాళాలను సేకరిస్తున్నారు. ఈ విధంగా పెద్ద ఎత్తున విరాళాలు సమకూరితే దాంతో కార్పస్ ఫండ్ ని ఏర్పాటు చేస్తే అన్న క్యాంటీన్లు దివ్యంగా కొనసాగుతాయి. సర్కార్ కి మంచి పేరు వస్తుంది. పేదలకు పట్టెడు అన్నం దొరుకుంతుంది అన్నది బాబు మార్క్ ప్లాన్. ఒక అన్న క్యాంటీన్ కి ఒక రోజుకు పాతిక నుంచి ముప్పయి వేల రూపాయలు ఖర్చు అవుతుంది అన్నది లెక్క. ఈ విధంగా రెండు వందల అన్న క్యాంటీన్లకు ఒక రోజుకు అయ్యే ఖర్చు 50 లక్షల దాకా అవుతుంది.

ఇలా లెక్క వేసుకుంటే నెలకు పదిహేను కోట్లు ఏడాదికి 200 కోట్లు గా లెక్క. అయితే ఈ మొత్తాన్ని పూలప్ చేయడం ద్వారా కార్పస్ ఫండ్ ని సృష్టిస్తే ఆ వడ్డీతో ఈ క్యాంటీన్లను నడపవచ్చు అన్నది ఒక

2 లో

# దేశంలోనే బెస్ట్ ఇండస్ట్రీ పాలసీ రూపొందిస్తాం.

- రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతాం
- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఊతమిస్తాం.
- సింగిల్ విండో పాలసీన సమర్థవంతంగా అమలు చేస్తాం.
- యువతలో నైపుణ్యాలు పెంచేవిధంగా చర్యలు తీసుకుంటాం.
- పాలసీ రూపకల్పనలో అందరి సలహాలు, సూచనలు స్వీకరిస్తాం.
- యువతకు ఉపాధి కల్పన పై దృష్టిపెడతాం.
- నేటి యువత టెక్నాలజీ అందిపుచ్చుకునే విధంగా నైపుణ్య శిక్షణ అందిస్తాం.
- పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తాం.
- కొండపల్లి శ్రీనివాస్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి .

వివరాలు 2 లో

# వరద నీటిలో స్టాప్ లాగ్ గేటు ఏర్పాటు చేయడం

- ఫలితంగా తుంగభద్ర రిజర్వాయరులో 40 టి.ఎం.సి.ల వరద నీటిని కాపాడుకోగలిగాం
- రాష్ట్ర రైతాంగం ప్రత్యేకించి రాయలసీమ రైతాంగం తరపున కన్నయ్య నాయుడికి కృతజ్ఞతలు
- రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తుండగా తుంగభద్ర 19 వ గేటు స్థానంలో స్టాప్ లాగ్ గేటును ఏర్పాటు చేయడం అనేది భారత దేశ చరిత్రలోనే ఒక అపూర్వమైన ఘట్టమని, అటు వంటి రికార్డును సృష్టించిన ప్రముఖ సాగునీటి రంగ నిపుణులు కన్నయ్య నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఈ స్టాప్ లాగ్ గేటు ఏర్పాటు చేయడం వల్ల సుమారు 40 టి.ఎం.సి.ల నీరు వృదా కాకుండా కాపాడుకోవడం

2 లో

# సోమశిల ప్రాజెక్టుకు పూర్వ వైభవం తీసుకొస్తాం

## • మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి




**నెల్లూరు (జర్నలిస్ట్ ఫైల్ ) :** వైసీపీ హయాంలో ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి విమర్శించారు. ప్రాజెక్టుల పనులు చేయకుండా నిలిపేశారన్నారు. నెల్లూరులో ఎమ్మెల్యే కోటంరెడ్డి, టీడీపీ నేతలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరిగేషన్‌పై మాజీ సీఎం జగన్‌కు చిత్తశుద్ధి, అవగాహన లేదని మండిపడ్డారు. వైకాపా పాలనలో రైతులు నాశనమయ్యారన్నారు.

"సోమశిల ప్రాజెక్టుకు పూర్వ వైభవం తీసుకొస్తాం. దెబ్బతిన్న కాంక్రీట్ పనులు వచ్చే సీజన్‌కు పూర్తి చేసేలా ప్రణాళిక రచిస్తున్నాం. రాళ్లపాడు ప్రాజెక్టుకు నీళ్లు తీసుకెళ్లేలా ప్రణాళికలు ఉన్నాయి. రెండేళ్ల క్రితం వరదల్లో సోమశిల జలాశయం దెబ్బతిన్నా జగన్ ప్రభుత్వం పటించుకోలేదు. రైతుల ఆందోళనను తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకస్మికంగా వచ్చి రైతులతో ప్రజావేదిక నిర్వహించారు. జగన్‌లా పోలీసు బలగాలు లేవు, తెరలు మాటున రాలేదు, ఒక్క చెట్టునూ తొలగించలేదు. సోమశిల వద్ద దెబ్బతిన్న పనులను సీఎం పరిశీలించారు. విజన్ ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు. భవిష్యత్‌పై ప్రణాళిక, అవగాహన లేని నాయకుడు జగన్" అని ఆనం రామనారాయణ రెడ్డి వ్యాఖ్యానించారు.

వివరాలు 3 లో

# మాది పేదల ప్రభుత్వం..

- ప్రజా సమస్యల పరిష్కారమే మా లక్ష్యం
- వచ్చిన అర్జీదారులు చిరునవ్వుతో తిరిగి వెళ్లేలా చూస్తోన్నాం
- గతంలో మంత్రులు, ముఖ్యమంత్రిని కలవాలంటే సామాన్యుడికి సాధ్యపడేది కాదు
- నేడు మంత్రులు, నేతలను ప్రజలు స్వయంగా కలిసి సమస్యలు తెలియజేస్తోన్నారు
- గత అరాచక పాలన.. నేటి ప్రజా పాలనకు తేడాను ప్రజలు గమనించాలి
- మంత్రి అనగాని సత్యప్రసాద్ - మాజీ మంత్రి కెఎస్ జవహర్

# జగన్, విజయసాయిలు విదేశీ పర్యటనలకు అనుమతివ్వడం సరికాదు : టీడీపీ నేత వర్ల



**మంగళగిరి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరియు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిలు యూరప్ పర్యటనకు అనుమతి కోరడంపై టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జగన్, విజయసాయిల పై ఉన్న కేసుల విచారణ ఇంకా పూర్తి కాకుండానే వీరికి విదేశీ పర్యటనలకు అనుమతి ఇవ్వడంపై ఆయన ప్రశ్నించారు.

3 లో

# వైసీపీ హయంలో శాంతి భద్రతల విధ్వంసం

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : గత వైసీపీ ప్రభుత్వం శాంతి భద్రతలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని, నేరాలు విపరీతంగా పెరిగాయని హెూం మంత్రి అనిత విమర్శించారు. మహిళా భద్రత సహా, వివిధ నేరాల్లో చేపట్టాల్సిన చర్యలపై సీఎం సమీక్ష చేశారన్నారు. ప్రతి పోలీసు స్టేషన్ వద్ద 6 సీసీ కెమెరాలు పెట్టాలని సుప్రీంకోర్టు చెప్పిందని, అయినా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన నిధులు తక్షణం విడుదల చేయాలని సీఎం ఆదేశించారని చెప్పారు. నేర పరిశోధనలో కీలకమైన వేలి ముద్రల గుర్తింపు కోసం కూడా గత ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోలేదని మండిపడ్డారు.

ఏపీలో 15వేల సీసీ కెమెరాలు ఉన్నాయి కానీ, గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఎన్ని పనిచేస్తున్నాయన్నది తెలియని పరిస్థితి ఉందన్నారు. నేరాలు జరిగే అవకాశాలు ఉన్న ప్రాంతాలు, మహిళా కళాశాలలు, మెడికల్ కళాశాలలు, బస్టాండు, రైల్వే స్టేషన్లు ఇలా వివిధ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఎం చెప్పారన్నారు. పోలీసులకు కొత్త వాహనాలు కొనుగోలుకు సీఎం నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు. గంజాయి సాగు, రవాణాలను గుర్తించి చర్యలు చేపట్టాలని సీఎం సూచించారని, గంజాయి నియంత్రణకు రాష్ట్రవ్యాప్త ర్యాలీ నిర్వహించేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. యాంటినార్కోటిక్స్, టాస్క్‌ఫోర్స్ కూడా ఏర్పాటు చేశామన్నారు. సైబర్ నేరాల సంఖ్య ఎక్కువగా పెరిగిందని, దీన్ని అరికట్టేలా ప్రతి జిల్లాలో సైబర్‌క్రైమ్ స్టేషన్ ఏర్పాటుకు నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు.




# గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించండి

- ప్రతి గ్రామ సభకు ప్రత్యేక అధికారిని నియమించాలి
- ఉపాధిహామీ పనులపై అవగాహన తోపాటు గ్రామాల్లో కనీస సౌకర్యాలపై చర్చించాలి
- సెప్టెంబరు 11 నుండి నూతన ఇసుక విధానం అమలు ప్రారంభం
- ఉచిత ఇసుక విధానంపై మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలి
- ఇసుక రీచ్ ల వారీగా ఇసుక తవ్వకం,రవాణా చార్జీల ధరలను నిర్ధారించండి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఈనెల 23న ఒకేరోజు నిర్వహించే గ్రామ సభలను విజయవతంగా నిర్వహించాలని ప్రతి గ్రామ సభకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జిల్లా కలక్టర్లను

# థర్డుపార్టీ ఏజన్సీల వల్లే కంపెనీల్లో భద్రతా ప్రమాణాలు సన్నగిల్లాయి

- అనకాపల్లి సెజ్ లో జరిగిన అగ్నిప్రమాద బాదితులకు తక్షణ సహాయ చర్యలు అందజేస్తున్నాం
- రాష్ట్ర కార్మిక, ప్యాక్టరీల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ) :** గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన థర్డు పార్టీ ఏజన్సీ విధానం కారణంగానే కంపెనీల్లో భద్రణా ప్రమాణాలు సన్నగిల్లి ప్రవమాదాలకు దారితీస్తున్నాయని రాష్ట్ర కార్మిక, ప్యాక్టరీలు, బాయిలర్స్ & భీమా వైద్య సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. బుధవారం

2 లో

# అచ్యుతాపురం సెజ్లో పేలిన రియాక్టర్.. 16కు చేరిన మృతులు



**అనకాపల్లి (జర్నలిస్ట్ ఫైల్ ) :** అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం అచ్యుతాపురం ఫార్మా సెజ్లో బుధవారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం జరిగింది. రియాక్టర్ పేలిన ఘటనలో మృతుల సంఖ్య 16కి చేరింది. మరో 50మందికి పైగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతను బట్టి మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. అచ్యుతాపురం ఫార్మా సెజ్ లోని ఎసెన్షియా అడ్వాన్సుడ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వందల సంఖ్యలో కార్మికులు, సిబ్బంది పనిచేస్తున్నారు. భోజన విరామ సమయంలో భారీ పేలుడు సంభవించి మంటలు చెలరేగాయి. దట్టంగా పొగ అలుముకొని ఏం జరుగుతుందో అర్థం కాని

2 లో

# సంపద సృష్టిస్తున్న బాబు

(మొదటి పేజీ తరువాయి)

లెక్క. అందుకోసమే బాబు కార్పోరేట్ శక్తులను పెద్దలను విరాళాల కోసం పిలుస్తున్నారు. అంతా వచ్చి తలా కాస్తా సాయం చేస్తే మొత్తం ఖర్చు పోతుంది. లేకపోయినా సర్కార్ కి సగానికి సగం ఖర్చు తగ్గుతుంది. అంటే ఒక సంక్షేమ పథకం అద్భుతంగా నడుపుతూ సర్కార్ పెద్దగా భారం పెట్టుకోకుండా ఎలా చేయాలో బాబు చూపిస్తున్నారు అన్న మాట. మరి ఇది సంపద సృష్టి కాదా అని టీడీపీ నేతలు అంటున్నారు. అలాగే ఏపీలోని రోడ్లను అభివృద్ధి చేయాలంటే ప్రభుత్వానికి ఏకంగా ఎనిమిది నుంచి పది వేల కోట్లు ఖర్చు అవుతాయి. దాంతో పీపీపీ ఫోర్ అన్న విధానంలో బాబు వీటిని అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నారు.

దాని వల్ల రోడ్ల నిర్మాణం జరుగుతుంది. వాటిని నిర్మించిన సంస్థలు టోల్ గేట్ పెట్టినా అవి టూ వీలర్ త్రీ వీలర్స్ కి మినహాయింపు ఇచ్చేలా ప్రభుత్వం చూస్తుందని అంటున్నారు. ఇది అభివృద్ధికి బాబు వేసిన ఒక గొప్ప ఆలోచన అని అంటున్నారు. ఇక ప్రభుత్వ ఆసుపత్రులను కార్పోరేట్ ఆసుపత్రులకు అటాచ్ చేయడం ద్వారా అక్కడ పేదలకు ఉచితంగా వైద్యం అందించాలని కూడా ప్రభుత్వం ఆలోచిస్తోంది. దీనికి నాందిగా చిత్తూరులోని ప్రభుత్వ ఆసుపత్రిని అ-పోలో ఆసుపత్రికి ఇస్తున్నారు అని అంటున్నారు. అలాగే మెడికల్ కాలేజీలను కూడా నిర్వహణ కోసం ప్రైవేట్ వారికి ఇస్తున్నారు అని అంటున్నారు. ఇలా ఖజానాకు భారం కాకుండా అదే సమయంలో పేదలకు సేవలు పోకుండా వయా మీడియాగా బాబు తీసుకుంటున్న ఈ చర్యలనే సంపద సృష్టి అంటారని టీడీపీ నేతలు చెబుతున్నారు.

జగన్ సీఎం గా ఉన్నపుడు ప్రతీ దానికీ అప్పులు చేసేవారు. అవి తడిసి మోపెడు అయ్యాయని అంటున్నారు. దానికి బదులుగా బాబు పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ ని ప్రోత్సహిస్తున్నారని దీని వల్ల అప్పుల బెడద నుంచి తప్పించుకోవచ్చు అని అంటున్నారు. అప్పు చేయకపోవడమే సంపద అన్నది కూడా బాబు మార్క్ థియరీ అని అంటున్నారు. – ఇక రానున్న రోజులలో ఎటూ పరిశ్రమలు వస్తాయి కాబట్టి వాటి వల్ల వచ్చే పన్నుల ఆదాయం తో కొత్త రూపాయి ఖజానాకు చేరుతుందని ఇదంతా అయిదేళ్ల కాలంలోనే జరుగుతుంది అని అంటున్నారు. మొత్తానికి ఒక ప్రభుత్వం ఒక మంచి పథకం కోసం సమాజంలోని వారిని కలుపుని పోతే ఖజానా భారం తగ్గుతుంది. ఈ విధానాలను జగన్ కూడా నాడు చేసి ఉంటే బాగుండేది అని అంటున్నారు

## థర్డుపార్టీ ఏజన్సీల వల్లే కంపెనీల్లో భద్రతా ప్రమాణాలు సన్నగిల్లాయి

(మొదటి పేజీ తరువాయి)

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్ లో రియాక్టరు ప్రేలడం వల్ల జరిగిన అగ్నిప్రమాదం నేపథ్యంలో రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్లో ఆయన పాత్రికేయులతో మట్లాడుతూ బాదితులకు తక్షణ సహాయక చర్యలు అందజేస్తున్నట్లు తెలిపారు. అచ్యుతాపురం సెజ్ లో ఎసెన్సియా అడ్వాన్సుడ్ సైన్సెస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ రియాక్టర్ ప్రేలిన ప్రమాదంలో గాయపడిన వారిని తక్షణ సహాయక చర్యల్లో భాగంగా దగ్గర్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుత్రుల్లో చికిత్స అందజేయడం జరుగుతున్నదన్నారు. జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ సంఘన స్థలానికి హుటాహుటిన చేరుకుని సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారన్నారు.

గత ప్రభుత్వ హయాంలో థర్డు పార్టీ ఏజన్సీ విదానాన్ని ప్రవేశపెట్టడం వల్ల కంపెనీల్లో భద్రతా ప్రమాణాలు పూర్తిగా సన్నగిల్లాయన్నారు. కార్మిక శాఖ పూర్త స్థాయిలో నిర్లక్ష్యానికి గురైందన్నారు. విశాఖపట్నంలో దళారీ వ్యవస్థ ఎక్కువగా ఉందన్నారు. ఇ.ఎస్.ఐ. ఆసుపత్రుల నిర్వహణ కూడా పూర్తి స్థాయిలో నిర్లక్ష్యం చేయడం జరిగిందని, కేంద్ర నిధులను కూడా సక్రమంగా వినియోగించుకో లేకపోవడం జరిగిందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు అందాల్సిన రాయితీలను, సంక్షేమ పథకాలను నిలుపుదల చేయడం జరిగిందన్నారు. ఈ సమస్యలను అన్నింటినీ సరిదిద్దేందుకు అధికారులతో పలు మార్లు సమీక్షలు నిర్వహిస్తూ కార్మిక శాఖలో పూర్వవైభవాన్ని తీసుకు వచ్చేందకు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

## కనకదుర్గమ్మ వారిపై రోడ్డు ప్రమాదం కానిస్టేబుల్ మృతి

మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ) : మంగళగిరి ఆరవ బెటాలియన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న కె తారక రామారావు గుంటూరు విజయవాడ రహదారిలో కనకదుర్గ వారధి మీద 47వ పిల్లర్ దగ్గర లారీ వెనుక నుండి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


## అచ్యుతాపురం సెజ్లో పేలిన రియాక్టర్.. 16కు చేరిన మృతులు

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితి నెలకొంది. పేలుడు ధాటికి పలువురు కార్మికుల మృతదేహాలు ఛిద్రమయ్యాయి.

కార్మికులు ప్రాణ భయంతో బయటకు పరుగులు తీశారు. భారీ శబ్దంతో సమీప గ్రామాల ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఫార్మా సెజ్ లోని అగ్నిమాపక యంత్రం సహా చుట్టుపక్కల నుంచి మరో 11 యంత్రాలు వచ్చి మంటలను అదుపు చేశాయి. క్షతగాత్రులను చికిత్స కోసం అనకాపల్లిలోని వేర్వేరు ఆసుపత్రులకు తరలించారు. కాలిన గాయాలతో కొందరు మృతి చెందగా, మొదటి అంతస్తు శ్లాబు కింద పడి ఏడుగురు మృతి చెందారు. గాయపడ్డ వారిలో ఐదుగురు 60 శాతానికి పైగా కాలిన గాయాలతో ఉన్నట్టు తెలుస్తోంది. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో రెండో షిఫ్టోని దాదాపు 380 మంది కార్మికులు విధుల్లో ఉన్నట్టు సమాచారం. రియాక్టర్ పేలుడు ధాటికి పరిశ్రమలోని మొదటి అంతస్తు శ్లాబు కూలిపోయిందని, శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్టు కార్మికులు చెబుతున్నారు. మూడో అంతస్తులో చిక్కుకున్న కార్మికులను క్రేన్ సాయంతో బయటకు తీసుకొచ్చారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, అగ్నిమాపక సిబ్బందితో ఘటనా స్థలిలో సహాయక చర్యలు కొనసాగుతన్నాయి.

# బీసీలకు రక్షణ రత్న చట్టం కల్పించాలి



గుంటూరు, పెదకాకాని ( జర్నలిస్ట్ ఫైల్): బీసీలకు రక్షణ చట్టం, బిసి యాక్ట్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో చేయాలి అని కోరుతూ బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు సవిత వినతి పత్రాన్ని అందజేశారు.ప్రస్తుత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్లోబీసీ కుల గణన నిర్వహించాలని, జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించి వారికి రాజకీయ ఎదుగుదలకు ప్రభుత్వాలు కృషి చేయాలి అని,అదేవిధంగా బీసీ వెల్ఫేర్ హాస్టల్స్ నిర్వహణ సక్రమంగా లేనందున విద్యార్థులు ఇబ్బందులు గురవుతున్నారు. రాష్ట్రంలో బీసీ హాస్టల్స్ మెరుగుపరచి సరైన మౌలిక వసతులు కల్పించి బడుగు బలహీన వర్గాల పిల్లలకు,వసతి కల్పించడంలో, విద్యను అందించడంలో ప్రభుత్వాలు కృషిచేయాలని తెలిపారు.రాష్ట్రంలో బీసీ మహిళల పైన బీసీలపైన జరుగుతున్న దాడులను నియంత్రించాలి, బీసీ చట్టం ఒకటే పరిష్కారం అనితెలిపారు. అంశా లను రెప్రజెంటేషన్ రూపంలో కోరుతూ సెక్రటేరి యట్ లో వారి కార్యాలయంలో కలసి రిప్రజెంటేషన్ అందజేశారు. కార్యక్రమంలో కుక్కల రాం ప్రసాద్, బీసీ సంఘం స్టేట్ జనరల్ సెక్రెటరీ యామా మురళి,బిసి సంక్షేమ సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు దొంత సురేష్,బీసీవి రాష్ట్ర నాయకులు, మోర్లవెంకటకృష్ణ బుర్రా గుడారంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## యూనివర్సిటీ వ్యవసాయ విశ్వవిద్యాలయ టైంస్కేల్ ఉద్యోగుల సమస్యలపై సీటీయూ ప్రతినిధుల వినతిపత్రం సమర్పణ



అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ వ్యవసాయ విశ్వవిద్యాలయ టైంస్కేల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించమని కోరుతూ, నేడు సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెయ్యనాయుడుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాత్యులు ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తామన్న భరోసా ఇచ్చారు. యూనివర్సిటీ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తామని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంలో ఆచార్య ఎన్.జి రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో టైంస్కేల్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు . ముఖ్యంగా పదవీ విరమణ వయస్సు పెంపు, రెగ్యులరైజేషన్, మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇంక్రిమెంట్లు వంటి అంశాల ను ప్రస్తావించారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎ.వి. నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె.ఎస్. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్ తో మరణించిన బాలుడి కుటుంబానికి రూ. 5 లక్షల పరిహారం



- **గాయపడిన బాలుడికి ఆర్థిక సహాయం అందిస్తూ ఉచితంగా వైద్య సేవలు అందిస్తాం**
- **కడప ఎమ్మెల్యే ఆర్ మాధవి రెడ్డి.**

కడప జిల్లా (జర్నలిస్ట్ ఫైల్) : కడప నగరం బెల్లం మండిలో ఇంటర్నేషనల్ కళ్యాణ మండపం (టైటానిక్ బిల్డింగ్)వద్ద విద్యుత్ వైర్లు తెగిపడి ఒక బాలుడు మృతి చెందగా, మరొక బాలుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన విన్న వెంటనే కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి స్థానిక హాస్పిటల్లో చికిత్స పొందుతున్న బాలుడి పరిస్థితి తెలుసుకుని, బాలుడికి అత్యవసర చికిత్సను అందించాల్సిందిగా హాస్పిటల్ యాజమాన్యాన్ని కోరడం అయినది.సంఘటన స్థలాన్ని పరిశీలించి, బాధ్యులపై చర్యలు తీసుకునేల అధికారులతో మాట్లాడటం జరిగింది. విద్యుత్ శాఖ మంత్రితో మాట్లాడి మరణించిన బాలుడి కుటుంబానికి 5లక్షల పరిహారం అందించనున్నము, అలాగే వారి కుటుంబానికి మా వంతు సహకారం అందిస్తాం. గాయపడిన బాలుడికి ఆర్థిక సాయం, ఉచితంగా వైద్యం అందిస్తున్నాము. ఈ కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసుల రెడ్డి మైనార్టీ నాయకులు జిలాన్ భాష స్థానిక నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దేశంలోనే బెస్ట్ ఇండస్ట్రీ పాలసీ

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ )** : వికసిత్ ఆంధ్రప్రదేశ్ లో భాగంగా దేశంలోనే బెస్ట్ ఇండస్ట్రీ పాలసీని రూపొందించనున్నామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. నూతన ఇండస్ట్రీ పాలసీ రూపకల్పన లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, ఏపీఐఐసీ, సీఐఐల సంయుక్త ఆధ్వర్యంలో స్టేక్ హోల్డర్స్ సమావేశం విజయవాడలోన ఓ ప్రైవేట్ హోటల్ లో బుధవారం జరిగింది. సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖామాత్యులు టీ.జి. భరత్ వర్చువల్ గా తన సందేశాన్ని అందించారు. స్టేక్ హోల్డర్స్ సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపిస్తుండటం శుభసూచకమన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతామని చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఊతమిస్తే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. సింగిల్ విండో పాలసీని సమర్థవంతంగా అమలు చేస్తామని తెలిపారు. సింగిల్ విండో పాలసీ అమలులో భాగంగా నెలకు రెండు సార్లు సమావేశాలు నిర్వహించి దరఖాస్తుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా, టెక్స్ టైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటో రంగం, బయోటెక్ రంగాలతో పాటు అన్ని రంగాలకు ప్రాధాన్యత కల్పించి ఏపీని పారిశ్రామిక రంగంలో దేశంలోనే టాప్ గా నిలబెట్టాలన్న లక్ష్యంతో ముందు సాగుతున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.

రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఇంజనీర్లు, గ్రాడ్యుయేట్లు ఉన్నారని ఇది రాష్ట్రానికి బలమని, వారిలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంచి స్థానికంగానే వారికి ఉపాధి కల్పించడమే ధ్యేయమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు యూనివర్శిటీలతో, కాలేజీలతో మాట్లాడి కరిక్యులమ్ లో కొన్ని మార్పులు చేసి వారికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇండస్ట్రీలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన యువత తక్కువగా ఉన్నారని తమ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందింపుచ్చుకునేలా యువతకు తర్ఫీదు ఇస్తే వారు ఇక్కడే మంచి ఉద్యోగాలు సాధిస్తారని గుర్తించడం జరిగిందన్నారు. నూతన ఇండస్ట్రీ పాలసీ రూపకల్పనలో సూచనలు, సలహాలు అందించాలనుకునే వారు ఈ మెయిల్, పోస్ట్ ద్వారా కూడా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా నూతన ఇండస్ట్రీ పాలసీ కూడా సీఎం చంద్రబాబు ప్రకటించనున్నారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ కు మొదటి అడుగుగా నూతన ఇండస్ట్రీ పాలసీ ఉండబోతున్నారు. దేశంలోనే పారిశ్రామికంగా ముందున్న ఐదు రాష్ట్రాల ఇండస్ట్రీల పాలసీలను స్టడీ చేసి మన రాష్ట్రాంలో వాటి రిజల్ట్స్ ఎలా ఉంటాయని పరిశీలించి బెస్ట్ పాలసీని అందించనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మెడ్ టెక్ పార్క్ తరహాలోనే రాష్ట్రంలో మరిన్ని సెక్టార్ బేస్డ్ ఇండస్ట్రీ పార్క్ లను అభివృద్ధి చేయనున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మాన్యుఫ్యాక్చరింగ్, సర్వీస్ ఇండస్ట్రీస్ ఏర్పాటు లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. నేటి స్పీడ్ యుగంలో రోజు రోజుకు టెక్నాలజీ మారిపోతుందని, ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) వేగంగా అభివృద్ధి చెందుతుందని, ఆ నైపుణ్యాలు మన యువతకు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం, ప్రైవేట్ ప్రజల భాగస్వామ్యం (పిపిపి పార్టనర్ షిప్) తో అద్భుతాలు సృష్టించవచ్చాని, ఎంఎస్ఎంఈ ల స్థాపనతో స్థానిక యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి లభిస్తుందన్నారు. ఎంఎస్ఎంఈల స్థాపనకు ప్రత్యేకంగా కృషి చేస్తామన్నారు. టెక్స్ టైల్ రంగంలో పెద్ద సంఖ్యలో యువతకు ఉపాధి, ఉద్యోగకల్పన జరుగుతుందని మంత్రి తెలిపారు.

పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ వర్చువల్ గా స్టేక్ హోల్డర్స్ తో మాట్లాడుతూ 25 సంవత్సరాల క్రితమే సీఎం చంద్రబాబు ఒక సిఈవోలా పనిచేసి రాష్ట్రానికి పెట్టుబడుల వరద పారించారని, పారిశ్రామికవేత్తలకు ప్రోత్సహించడంతో పెద్ద సంఖ్యలో పరిశ్రమలు, కంపెనీలు తరలివచ్చాయని గుర్తుచేశారు. నూతన ఇండస్ట్రీ పాలసీని వంద రోజుల ప్రణాళికలో భాగంగా సెప్టెంబర్ లో తీసుకురానున్నామన్నారు. నూతన ఇండస్ట్రీపాలసీ బెస్ట్ గా ఉండేవిధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాలసీ రూపొందించడంలో పెట్టుబడులే లక్ష్యంగా ముందకు వెళుతున్నామని, పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పిస్తామని హామి ఇచ్చారు. రోడ్లు, విద్యుత్, నీరు తదితర మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని మంత్రి టి.జి. భరత్ తెలిపారు.

సమవేశంలో పాల్గొన్న స్టేక్ హోల్డర్స్ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వారి సూచనలు, సలహాలను ఖచ్చితంగా స్వీకరిస్తామని మంత్రి తెలిపారు. అలాగే స్టేక్ హోల్డర్స్ సమస్యలను విన్నవించగా వాటిని పరిష్కరిస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామి ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చేనేత, జౌళి శాఖ సెక్రటరీ కె. సునీత, ఇండస్ట్రీస్ శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్, పరిశ్రమల వాణిజ్య శాఖ డైరెక్టర్ చెరుకూరి శ్రీధర్, చేనేత, జౌళి శాఖ కమిషనర్ జి. రేఖారాణి, సీఐఐ ఏపీ ఛైర్మన్ వి.మురళీ కృష్ణ, సీఐఐ ఏపీ మాజీ ఛైర్మన్ జెఎస్ఆర్కె ప్రసాద్, ఏపీఐఐసీ వైస్ ఛైర్మన్ అభిషేక్ కిషోర్, స్టేక్ హోల్డర్స్ పాల్గొన్నారు.

# నేరస్తుల తాట తీయండి

(మొదటి పేజీ తరువాయి)

గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.

**పరికరాల ఏఎంసీకి దిక్కులేదు....కాలం చెల్లిన వాహనాలు**

పోలీసు శాఖ వద్ద 143 డ్రోన్లు ఉంటే అందులో 88 పనిచేస్తున్నాయని తెలిపారు. బాడీ వోర్న్ కెమేరాలు 1250 ఉంటే 444 మాత్రమే పనిచేస్తున్నాయని వివరించారు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టంలో 1180 కెమేరాలకు గాను కేవలం 317 మాత్రమే పనిచేస్తున్నాయని, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న 14,712 సీసీ కెమేరాల్లో 2371 కెమేరాలు పనిచేయడం లేదని వివరించారు. ఆటోమేటెడ్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టం కూడా పనిచేయడం లేదని తెలిపారు. వీటన్నింటినీ తిరిగి వాడుకలోకి తెచ్చేందుకు అవసరమైన రూ. 30 కోట్లు నిధులు కూడా గత ప్రభుత్వం ఇవ్వలేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. యాన్యువల్ మెయింటనెన్స్ ఛార్జీలు చెల్లించకపోవడం వల్ల చాలా సేవలు అందుబాటులో లేకాండా పోయాయని....వీటి వల్ల నేర విచారణలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. పోలీసు విభాగంలో 2014-19 మధ్య 5215 వాహనాల కొనుగోలుకు రూ. 221.8 కోట్లు ఖర్చు చేస్తే వైసీపీ ప్రభుత్వం కేవలం రూ. 67.3 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. కాలం చెల్లిన వాహనాలతో పోలీసు శాఖ ఇబ్బంది పడుతోందని...ప్రస్తుతం 2812 వాహనాల కోసం రూ. 281 కోట్లు బడ్జెట్ అవసరమని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

**నిధులు విడుదలకు సీఎం అంగీకారం**

అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ పోలీసు శాఖను మళ్లీ గాడిలో పెట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయా వ్యవస్థల్లో పరికరాల నిర్వహణ ఖర్చులకు ఎప్పటి నుంచో పెండింగులో ఉన్న రూ. 10 కోట్లు వెంటనే విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా సీసీ కెమేరాల ఏర్పాటులో పెండింగులో ఉన్న రూ. 11 కోట్ల బిల్లులు కూడా మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పోలీస్ శాఖను ఆధునికీకరించే కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వాటాగా రూ. 61 కోట్లు విడుదల చేయడానికి కూడా సీఎం ఆమోదం తెలిపారు. గత ప్రభుత్వం పోలీసులను క్షక్ష సాధింపులకు, ప్రజల, రాజకీయ పార్టీల అణిచివేతకు ఉపయోగించుకుంది కానీ.....పోలీసు శాఖ సామర్థ్యం మాత్రం పెంచేలేదని అన్నారు. నేర పరిశోధనలో కీలకమైన ఫింగర్ ప్రింట్ వంటి విభాగాలకు, పరికరాలకు కనీసం రూ. 10 కోట్లు యాన్యువల్ మెయింటనెన్స్ చార్జెస్ చెల్లించకపోవడంపై ముఖ్యమంత్రి విస్మయం వ్యక్తం చేశారు. పోలీసు శాఖను మళ్లీ గాడిన పెడతామని.....రాష్ట్ర స్థాయి అధికారుల నుంచి కింద పనిచేసే ఎస్ఐ వరకు మార్పు కనిపించాలని సీఎం స్పష్టం చేశారు. మహిళలపై హింస విషయంలో చాలా కఠినంగా ఉండాలి. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అనేది నేరస్తులకు అర్థం కావాలి అని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. గత ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో గంజాయి సాగు, సరఫరా, వాడకం విపరీతంగా పెరిగిందని.. డ్రోన్స్ ను వినియోగించి గంజాయి పంట ఎక్కడ ఉందో గుర్తించి నాశనం చేయాలని అన్నారు. రాష్ట్రంలో, గంజాయి డ్రగ్స్ అనే మాట వినిపించకూడదని అన్నారు. గంజాయి లేని రాష్ట్రం కోసం ఉత్పత్తి, సరఫరా, వాడకం మధ్య ఉన్న చైన్ తెంచడం ద్వారా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే నెలలో రాష్ట్రంలోని 26 జిల్లాల్లో గంజాయి, డ్రగ్స్ కు వ్యతిరేకంగా ర్యాలీలు చేద్దామని...ఈ కార్యక్రమంలో తాను కూడా పాల్గొంటానని సీఎం అన్నారు. గంజాయి విషయంలో ప్రజలను చైతన్యపరచాల్సిన అవసరముందని సీఎం అన్నారు. నేరాల విచారణ విషయంలో అసలత్వాన్ని, ఆలస్యాన్ని సహించేది లేదని......నేరం జరిగిన వెంటనే క్లూస్ టీం, ఫోరెన్సిక్ బృందాలు ఎందుకు వెళ్లడం లేదని సీఎం ప్రశ్నించారు. ఇకపై ఈ పరిస్థితి మారాలన్నారు. నేరం జరిగిన చోట వేగంగా పోలీసులు స్పందిచకపోతే...తానే స్వయంగా కొన్ని ఘటనలకు వెళ్లి విచారణను పర్యవేక్షిస్తానని సీఎం స్పష్టం చేశారు. సైబర్ క్రైం ను ఎదుర్కోవడానికి నిపుణులతో చర్చించాలని...అవసరమైతే కొత్త చట్టాలు కూడా తీసుకొద్దామని చెప్పారు. ప్రతి జిల్లాలో ఒక సైబర్ పోలీస్ స్టేషన్ పెట్టాలని సిఎం అన్నారు. ఇన్వెస్టిగేషన్ చార్జెస్ కింద కొంత మెత్తం విచారణ అధకారులకు ఇచ్చే విధానాన్ని ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రారభించారని.... ఇప్పుడు దాన్ని మళ్లీ పునరుద్దరించాలని అధికారులు కోరగా దానికి సీఎం అంగీకరించారు. వీటితో పాటు గ్రేహౌండ్స్ సెంటర్, ఏపి పోలీసు అకాడమీ, ఏపి స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ పోర్స్ సెంటర్, ఎపి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ ఏర్పాటు స్థితిగతులను అధికారులు వివరించారు. కేంద్ర నుంచి వీటికి రావాల్సిన నీధులు తెచ్చుకుని వెంటనే పనులు మొదలు పెట్టాలని సీఎం అదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో విషయంలో ఏం చర్యలు తీసుకుంటున్నారు అనే ప్రణాళికతో రావాలని సీఎం ఆదేశించారు. వాహనాల ఫిట్ నెస్ విషయంలో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఈ విషయంలో వాహనదారులను వేధించినట్లు కాకుండా....ప్రజల రక్షణ కు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సీఎం అన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం అయ్యేవారిని వదిలిపెట్టవద్దని చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో కఠినంగా ఉండాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**విపత్తు నిర్వహణ శాఖనూ నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వం**

విపత్తు నిర్వహణ సంస్థ కు తన వాటాగా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన 25 శాతం నిధులు ఇవ్వక పోగా....కేంద్ర నుంచి వచ్చిన నిధులనూ డైవర్ట్ చేశారని అధికారులు వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇది ఒక రకంగా నేరం అని ఆయన వ్యాఖ్యానించారు. భారీ వర్షాల సమయంలో పిడుగులు పడే సందర్భాల్లో ప్రజలను అప్రమత్తం చేసే వ్యవస్థ పనితీరును అధికారులు సీఎంకు వివరించారు. నాటి తెలుగు దేశం హయాంలో ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. దీన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో విపత్తులు వచ్చిన సమయంలో వెంటనే సంబంధిత శాఖలు సమన్వయంతో కేంద్రానికి నివేదికలు ఇవ్వాలని...తద్వారా కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని ప్రజలకు సాయం చెయ్యవచ్చని సీఎం అన్నారు.

# వరద నీటిలో స్టాప్ లాగ్ గేటు ఏర్పాటు చేయడం రికార్డు

(మొదటి పేజీ తరువాయి)

జరిగిందన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్ లో సర్వేపల్లి నియోజక వర్గం శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ప్రముఖ సాగునీటి రంగ నిపుణులు, రిటైర్డ్ అధికారి కన్నయ్య నాయుడుతో కలసి మంత్రి పాత్రికేయులతో మాట్లడుతూ తుంగభద్ర రిజర్వాయరు 19 వ గేటు తీవ్రమైన వరదనీటికి కొట్టుకు పోవడంతో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రైతాంగం తీవ్ర ఆందోళనకు గురయ్యారన్నారు. అటు వంటి క్లిష్టపరిస్థితులో సంక్షోభాలను అధిగమించడంలో మంచి అనుభవం ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు సాగునీటి రంగంలో దాదాపు 50 సంవత్సరాల అనుభవం ఉన్న శ్రీ కన్నయ్య నాయుడు సహాకారంతో స్టాప్ లాగ్ గేటును ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఫలితంగా నేడు సుమారు 77 టి.ఎం.సి.ల నీరు ఆ రిజర్వాయరులో నిల్వ ఉండటం వల్ల రాయలసీమ ప్రాంతంలోని ఎల్.ఎల్.సి., హెచ్.ఎల్.సి., కె.సి. కెనాల్ కు సమృద్ధిగా త్రాగునీరు, సాగు నీరు అందించగలిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. తుంగభద్ర గేటు కొట్టుకుపోయిందని తెలిసిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు అ-



ర్థరాత్రి సైతం నాతో, అనంతపురం జిల్లాకు చెందిన మంత్రి పయ్యావుల కేశవ్ మరియు జలవనరుల శాఖ కార్యదర్శితో కాన్ఫరెన్సు నిర్వహించి అప్రమత్తం చేయడం వల్లే ఈ సంక్షోభం నుండి గట్టెక్కగలిగామన్నారు. లేకుంటే తుంగభద్ర జలాశయం ద్వారా త్రాగు, సాగు నీరు పొందే అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలతో పాటు తెలంగాణాకు చెందిన ప్రజలు, రైతులు ఎన్నోసమస్యలను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడేదన్నారు. రాష్ట్ర రైతాంగం ప్రత్యేకించి రాయలసీమ రైతాంగం తరపున కన్నయ్య నాయుడికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రముఖ సాగునీటి రంగ నిపుణులు కన్నయ్య నాయుడు మాట్లాడుతూ గత 52 ఏళ్లుగా సాగునీటి రంగంలో పనిచేస్తూ దక్షణాది రాష్ట్రాల్లో ఇలాంటి గేట్లు ఎన్నో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తుంగభద్ర డ్యామ్ ను 1954 లో కమిషనింగ్ చేయడం జరిగిందని, దాని కాలపరిమితి 45 ఏళ్లుకాగా, ఇప్పటి వరకూ దాదాపు 70 ఏళ్ల పాటు పనిచేయడం జరిగిందన్నారు. 1970 లోపు ఏర్పాటు చేయబడిన తుంగభద్ర, ప్రకాశం, నాగార్జున సాగర్ డ్యామ్లకు స్టాప్ లాగ్స్ లేవన్నారు. 2002 లో ప్రకాశం బ్యారేజ్ గేట్లు మార్చడం జరిగిందన్నారు. తీవ్రమైన వరదనీటిలో రిస్కుతీసుకుని తుంగభద్ర రిజర్వాయరు గేటు మార్చడం అనే పనిని చాలెంజ్ గా నిర్వహించడం జరిగిందన్నారు. 50 మంది సాయంతో ఐదు రోజుల్లో గేటు డిజైన్ చేసి ఏర్పాటు చేయడం అనేది ఒక రికార్డు అన్నారు. ఇప్పుడు 26 లక్షల ఎకరాలకు నీరు లభించినట్లు అయ్యిందన్నారు..

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి
జన్మదిన శుభాకాంక్షలు, పొలిటికల్, స్వదేశాగమనం, లీగల్ ప్రకటనలు, క్లాసిఫైడ్స్
పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, సినిమా, వివాహ మహోత్సవం,
షష్టిపూర్తి మహోత్సవం మరియు అన్ని శుభకార్యాలు
ప్రకటనల విభాగం
76 61 80 59 68

# దివ్యాంగుల పింఛనుదారులలో అనర్హుల ఏరివేత!




అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దివ్యాంగుల పింఛనుదారుల్లో అనర్హుల ఏరివేతకు చర్యలు చేపట్టింది. దివ్యాంగులు కాకున్నప్పటికీ దొంగ సర్టిఫికెట్లతో పింఛను తీసుకుంటున్నవారికి ప్రభుత్వ సాయాన్ని నిలిపివేయనుంది. నకిలీ సర్టిఫికెట్లతో పింఛను తీసుకునే వారిని తొలగించే ఏర్పాటు చేస్తున్నామని మంత్రి బాలవీరాంజనేయ స్వామి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8 లక్షల మంది దివ్యాంగులు పింఛను అందుకుంటున్నారు. చాలామంది బోగస్ సర్టిఫికెట్లు జతచేసి లబ్దిదారులుగా తమ పేరు నమోదు చేసుకున్నారని చెప్పారు. వారిని గుర్తించి ఇప్పటికే నోటీసులు పంపించినట్లు మంత్రి వివరించారు. మళ్లీ సదరం క్యాంపులు నిర్వహించి మిగతా అనర్హులను గుర్తిస్తామని చెప్పారు. నిజమైన దివ్యాంగులు, అవసరమైన వారికే ప్రభుత్వ సాయం అందేలా చూస్తామన్నారు. దివ్యాంగ పెన్షన్ కోసం వచ్చే దరఖాస్తులను నిశితంగా పరిశీలించడంతో పాటు బోగస్ సర్టిఫికెట్లతో దాఖలు చేసే వాటిని ప్రాథమిక స్థాయిలోనే పక్కన పెట్టాలని అధికారులకు మంత్రి బాలవీరాంజనేయ స్వామి ఆదేశాలు జారీ చేశారు.

# సుప్రీంకోర్టు తీర్పుపై వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారిపై రాజద్రోహం కేసు నమోదు

నెల్లూరు (జర్నలిస్ట్ ఫైల్ ): ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, దీనిపై వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారిపై రాజద్రోహం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పందింటి సుబ్బయ్య మాదిగ డిమాండ్ చేశారు. నగరంలోని అంబేద్కర్ భవన్‌లో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు అవుతున్న మాదిగలు సామాజికంగా, ఆర్థికంగా రాజకీయంగా వెనకబడి ఉన్నారన్నారు. తమకు అనుకూలంగా వర్గీకరణ చేయమని కోర్టు తీర్పు వస్తే ... కొన్ని అంబేడ్కర్ సంఘాలు వ్యతిరేకంగా పోరాటం చేయడం తగదన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఎస్సీలందరికి రిజర్వేషన్ సౌకర్యం కల్పించారన్నారు. దశాబ్దాలుగా మాదిగలకు అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1996, 97 సంవత్సరంలో వర్గీకరణ చేసి అమలు చేశారని అప్పుడు ఎంతో మంది మాదిగలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ గౌరవాధ్యక్షులు కోటేశ్వరరావు, ఆనందరావు, కన్యకేశ్వరరావు, తాటి పర్తి రఘు, పలిగిలి చిన్నయ్య, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులపై ప్రముఖ ఇంజినీర్ ఆందోళన



(జర్నలిస్ట్ ఫైల్ ) : శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల గేట్ల పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని ప్రముఖ విశ్రాంత ఇంజినీర్, భారీ ప్రాజెక్టుల గేట్ల నిపుణుడు నాగినేని కన్నయ్య నాయుడు అన్నారు. తుంగభద్ర డ్యాంకు సంబంధించి కొట్టుకుపోయిన గేటుకు ప్రత్యామ్నాయంగా స్టాప్ లాగ్‌ను అమర్చడంలో కన్నయ్య నాయుడు కీలకపాత్ర పోషించారు.

ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణ, హైడ్రో మెకానికల్ ఇంజినిరింగ్ నిపుణుడైన కన్నయ్యనాయుడు తెలుగు రాష్ట్రాలకు కీలక సూచనలు చేశారు. అత్యంత కీలకమైన శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల గేట్ల జీవితకాలం ముగుస్తోందని, ప్రభుత్వాలు తగిన కార్యాచరణ రూపొందించి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

1970కి ముందు నిర్మించిన ప్రాజెక్టులకు స్టాండ్ బై గేట్లు ఏర్పాటు చేయనందున ఇప్పుడు తుంగభద్రకు స్టాప్‌లాగ్ బిగించాల్సి వచ్చిందన్నారు. తుంగభద్రకు ప్రమాదం పొంచి ఉందని రెండేళ్ళ క్రితమే హెచ్చరించినట్లు గుర్తు చేశారు. ఒకవేళ సమస్య వస్తే ఏం చేయాలనే దానిపై అప్పటి నుంచే ఆలోచించినట్టు చెప్పారు. రైతులకు అందాల్సిన నీళ్ళు వృథాగా సముద్రంలో కలవడం చాలా బాధేసిందన్నారు.

తుంగభద్ర డ్యాం గేట్ల వయసు అయిపోయిందని, కొత్త గేట్లు బిగించుకోవాల్సిందేనని అలా చేస్తే మరో 30 ఏళ్ళు సేవలు అందించవచ్చని వివరించారు. ఇందుకు మొత్తం రూ. 250 కోట్ల నుంచి 300 కోట్ల వరకు ఖర్చవుతుందని ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటే అవసరమైన సాయం అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు.

నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల వయసు కూడా అయిపోయిందని, వాటిని ఇప్పుడు ఎక్స్‌టెన్షన్‌లోనే నడుపుతున్నట్టు కన్నయ్యనాయుడు తెలిపారు. తుంగభద్రలాంటి ఘటనలు గతంలో దేశంలో జరిగినా నీళ్ళు ఉండగా ఎక్కడా స్టాప్ లాగ్‌లు అమర్చలేదన్నారు.

# కార్యకర్తలందరూ రాష్టాభివృద్ధికి కృషి చేయాలి



విజయనగరం (జర్నలిస్ట్ ఫైల్ ) : విజయనగరం నియోజకవర్గంలో తెలుగుదేశం యాప్ ద్వారా పార్టీ సమాచారాన్ని ప్రజలకు విస్తృత స్థాయిలో షేర్ చేసి టాప్ ఫర్ ఫార్మర్లుగా నిలిచిన కార్యకర్తలకు తెదేపా జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సంతకం చేసి పంపించిన ప్రశంసా పత్రాలను బుధవారం అశోక్ బంగ్లాలో ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతి రాజు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలందరూ ఉత్సాహంతో రాష్ట్రాభివృద్ధికి కోసం పాటు పడాలని, రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీయడానికి జగన్ చేస్తున్న అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టి, ప్రజలకు వాస్తవాలను తెలియజేయడంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తద్వారా తెదేపా బలోపేతానికి కృషి చేయాలని కోరారు. నాయకులు ప్రసాదులు ప్రసాద్ బంగారు బాబు తదితరులు పాల్గొన్నారు.

# గోరుచిక్కుడు ని ఏ నెలలో పండిస్తే ఎక్కువ లాభాలు వస్తాయి

(జర్నలిస్ట్ ఫైల్ ) : మెట్ట ప్రాంతాలకు అనువైన కూరగాయల్లో గోరుచిక్కుడు ఒకటి. దీనిని అంతరపంటగా కూడా సాగుచేసుకోవచ్చు. గోరుచిక్కుడు పంట ఉష్ణమండల పంట 40 డిగ్రీల ఎండను తట్టుకుంటుంది. సారవంతమైన ఒండ్రు నేలలు, ఎర్ర గరప నేలలు దీనికి చాలా అనుకూలం. విత్తనం వేసేముందు నాలుగు సార్లు దుక్కిదున్నాలి. చివరి దుక్కిలో 10టన్నుల పశు వ్యర్థం వేయాలి. ఎకరాకు 4,5 కిలోలు గోరుచిక్కుడు విత్తనం అవసరమవుతోంది. పచ్చిరొట్ట కోసం సాగుచేసే రైతులకు 12-15 కేజీల విత్తనం సరిపోతుంది. ఇది 90-120 రోజుల పంట ఇది. చాలా సులభమైన పంట. ఈగోరుచిక్కుడు పంటను వేయడంవల్లన తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడులను తీయవచ్చు. తక్కువ పెట్టుబడితో పండించగల ఆస్కారం ఉన్న పంట ఈగోరు చిక్కుడు దీనికి అన్ని నేలలు



అనుకూలంగా మార్చుకోవచ్చు. విత్తిన 50-60 రోజుల తరువాత కోత మొదలవుతుంది. ఎకరాకు 25-30 కింటాళ్ల దిగుబడిని తీస్తారు. ఎకరాకు 8-1 2 క్వింటాళ్ల ఎండిన గోరుచిక్కుళ్లు వస్తాయి.

**చీడపీడలు చాలా తక్కువ**

గోరుచిక్కుడు విత్తనాలను జూన్, ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో విత్తుకుంటారు. గోరు చిక్కుడులో హైబ్రీడ్ రకాలను మనం ఎంచుకోవడం వల్లన 7 నుంచి 10 టన్నుల వరకు దిగుబడి తీయడానికి అస్కారం ఉంది. దీనిలో చీడపీడలు చాలా తక్కువగా ఉంటాయి. కాబట్టి రైతులు పంట వైపు మగ్గుచూపుతే తద్వారా మంచి లాభాలు తీయవచ్చని ఆధికారులు అంటున్నారు. అంతేకాకుండా హైబ్రీడి విత్తనాలు కింద హెక్టారుకు 20000 వేల రూపాయిలు ఇస్తున్నారు. కావున రైతులు ఈఆవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. మరియు ప్రభుత్వం నుంచి కూరగాయల సాగుకు రాయితీలు అందుతున్నాయి.

**అంతర సేద్యం కూడా చేయవచ్చు**

కూరగాయలు సాగు చేసే రైతులు ఎక్కువగా సేంద్రియ సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. సాగులో రసాయనాలను ఎక్కువగా వాడటం ద్వారా దిగుబడులు తగ్గుతున్నాయన్ని అందుకే పాలేకర్ విధానాలు అయినా సేంద్రియ వ్యవసాయం వైపు మక్కువ చూపుతున్నామని అన్నారు. సేంద్రియ వ్యవసాయం చేయడం ద్వారా రైతులు నాణ్యమైన దిగుబడులను తీయగలుగుతున్నారు. దీనిలో అంతర సేద్యం కూడా చేయవచ్చు. ఈపంటకు ఎటువంటి పురుగులు ఆశించవు. దీనికి కూలీల ఖర్చు ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా కోత కోసే సమయంలో వారానికి మూడు సార్లు కూలీలు అవసరం ఆవుతారు. మార్కెట్లో రేటు మనకు అనుకూలంగా ఉన్నప్పుడు పంటను కోసి అమ్ముకోవచ్చు. గ్రామస్థాయిలోనే మనం మార్కెటు చేసుకుంటే డబ్బు ఆదాతో పాటు రవాణా ఖర్చులు కూడా మిగులుతాయి.

# లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా ముందుకు అడుగులు..

విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్ ): నగరంలో బీజేపీ సభత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. సభ్యత్వ నమోదుపై అవగాహన సమావేశాన్ని ఏపీ బీజేపీ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఏపీ బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదు కార్యక్రమం అనేది మన బాధ్యత అని.. లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. దేశ అభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధి బాధ్యత అందరి మీద ఉందన్నారు. పాశ్చాత్య ఆలోచన ధోరణికి స్వస్తి పలికెందుకు బీజేపీ ఆవిర్భావం అయ్యిందన్నారు. బీజేపీ ఆవిర్భావం నుంచి ఒక సిద్ధాంతంతో, కార్యకర్త బలంతో ముందుకు వెళ్తోందని చెప్పారు. 1984 లో పార్లమెంట్ సభల్లో ఇద్దరితో మొదలైన ప్రయాణం ప్రస్తుతం దేశ అభివృద్ధి కొరకు బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. భారతీయ సంస్కృతి విధి విధానాలతో బీజేపీ పని



చేస్తుందన్నారు. మోదీ నాయకత్వంలో సబ్ కా సాత్ సబ్ కా వికాస్ సిద్ధాంతంతో ముందుకు వెళ్తోందన్నారు. ఈ సిద్ధాంతం అనేది మన లక్ష్యాన్ని చేరుకునే విధంగా ఉంటుందన్నారు. కొన్ని రాష్ట్రాల్లో గెలవలేకపోయినా ఆయా రాష్ట్రాల అభివృద్ధి కొరకు బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. కరోనా ఉన్న సమయంలో బీజేపీ కార్యకర్తలు ప్రజలకు దగ్గరగా ఉండి సేవని అందించారని గుర్తుచేశారు. కార్యకర్తలే బీజేపీకి బలమన్నారు. రాష్ట్రంలో 37 లక్షల వరకు సభ్యత్వం ఉన్నారన్నారు. మోదీ ఆధ్వర్యంలో భారతదేశం అతి పెద్ద ఐదోవ ఆర్థిక శక్తిగా ఎదిగిందని వెల్లడించారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చి అమలు చేయగలుగుతున్నామన్నారు. మూడో ఆర్థిక శక్తిగా ఉంటే ఇంకా ఎక్కువుగా పేదల కోసం పని చేస్తామని ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి పేర్కొన్నారు.

# సీబీఐ విచారణకు అనుమతిస్తూ ఏపీ ప్రభుత్వం గెజిట్ జారీ



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ) : ఏపీలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులపై సీబీఐ నేరుగా విచారణ జరిపేందుకు అనుమతిస్తూ రాష్ట్రప్రభుత్వం గెజిట్ జారీ చేసింది. ఏపీ ఎన్డీయే ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులపై విచారణకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉందని స్పష్టం చేసింది. రాష్ట్రంలో సీబీఐ విచారణ పరిధిని కొనసాగించడంతో పాటు పెంచేందుకు ఈ గెజిట్ మరింత వీలు కల్పిస్తుంది. దిల్లీ ప్రత్యేక పోలీసు వ్యవస్థాపక చట్టం-1946లోని సెక్షన్-3 ప్రకారం సీబీఐ విచారణ పరిధిని పెంచుతున్నట్టు వివరించింది. 2014-19 మధ్య కాలంలో రాష్ట్రంలో సీబీఐ విచారణకు టీడీపీ ప్రభుత్వమే అనుమతి నిరాకరించింది. ఇప్పుడు టీడీపీ ప్రధాన భాగస్వామిగా ఉన్న కూటమి ప్రభుత్వమే అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# జగన్, విజయసాయిలు విదేశీ పర్యటనలకు అనుమతివ్వడం సరికాదు

(మొదటి పేజీ తరువాయి)

"సినిమా టికెట్ కొనడానికి కూడా డబ్బులేకుండా జీవితం గడిపిన జగన్, విజయసాయిలు నేడు యూరప్‌కు వెళ్లే స్థాయికి ఎలా చేరుకున్నారు?" అని ప్రశ్నించారు. జగన్ మరియు విజయసాయి రెడ్డిలకు కోర్టులు వెసులుబాటు కల్పించడం సరికాదని, వీరిపై విచారణ జరగడం లేదని, కోర్టులకు వీరు ఎందుకు హాజరుకావడం లేదని రామయ్య ప్రశ్నించారు. జగన్ పై పలు కేసులు ఉండగా, విజయసాయిరెడ్డి రాజ్యసభ సభ్యుడిగా ఉండటం ప్రజాస్వామ్యానికి తగదని ఆయన అభిప్రాయపడ్డారు. "జగన్, విజయసాయిలు 12 సంవత్సరాల క్రితం చేసిన నేరాలు ఇప్పటివరకు విచారణకు రాకపోవడం వెనుక కోర్టుల నిర్లక్ష్యమే కారణం," అని రామయ్య తెలిపారు. జగన్ మరియు విజయసాయిరెడ్డిలు యూరప్ వెళితే తిరిగి వస్తారా అన్న అనుమానం కలుగుతోందని, వారు విదేశాలకు వెళ్లకుండా కోర్టులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. "జగన్ మరియు విజయసాయిరెడ్డిలకు విదేశీ యాత్రలకు అనుమతి ఇవ్వడం వల్ల భారతదేశానికి తిరిగి వస్తారని నమ్మడం కష్టమని, కోర్టులు ఈ విషయంలో పున:పరిశీలన చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన సీబీఐ పై కూడా విమర్శలు చేశారు. "సీబీఐ వారు వీరి అవినీతి బహిర్గతం చేసినప్పటికీ శిక్షపడకపోవడం ఏమిటి? వీరిని సీబీఐ క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలి," అని రామయ్య అన్నారు. ఇకపోతే, ఈ కేసుల్లో విచారణ పూర్తయ్యేంత వరకు జగన్మోహన్ రెడ్డి మరియు విజయసాయిరెడ్డిలు విదేశీ పర్యటనలకు అనుమతి ఇవ్వకూడదని, వీరి మీద రోజువారి విచారణ జరపాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య కోర్టులను కోరారు.

# వైకాపా కేంద్ర కార్యాలయానికి పోలీసుల నోటీసులు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ): తాడేపల్లిలోని వైకాపా కేంద్ర కార్యాలయానికి పోలీసులు నోటీసులు అంటించారు. తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి రోజు సీసీ ఫుటేజ్ సమర్పించాలని నోటీసులు ఇచ్చారు. ఘటన జరిగిన రోజు వైకాపా కార్యాలయం నుంచి ఎవరెవరు బయల్దేరారనే అంశంపై పోలీసులు విచారణ చేపట్టారు. 2021 అక్టోబర్ 19 నాటి సీసీ ఫుటేజ్ సమర్పించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. మరోవైపు ఇదే ఘటనకు సంబంధించి వైకాపా నేత దేవినేని అవినాష్‌కు పోలీసులు నోటీసులిచ్చారు. గుణదలలోని ఆయన ఇంటికి అంటించారు. తాము చెప్పిన రోజు విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

# మాది పేదల ప్రభుత్వం..

టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజా వినతుల స్వీకరణలో భాగంగా మాజీ మంత్రి కెఎస్ జవహర్, మహిళా నేత ఆచంట సునీతలతో కలిపి నేడు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రజల నుండి వినతులు స్వీకరించారు. భూ వివాదాలపై పెద్ద ఎత్తున అర్జీలు రాగ.. వెనువెంటనే సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి సమస్యలను అక్కడికక్కడే మంత్రి పరిష్కరించారు.. మరికొన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాటితో పాటు పలు అర్జీలను ఆయా శాఖలకు పంపి విచారణ అనంతరం పరిష్కారం దొరికేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కర్నూలు జిల్లా కర్నూలుకు చెందిన పలువురు బాధితులు నేడు గ్రీవెన్స్ లో విజ్ఞప్తి చేస్తూ.. తాము స్థలాన్ని లీజుకు తీసుకొని నిర్మాణాలు చేపడితే... నాటి వైసీపీ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ రూ. 50 లక్షలు లంచం తీసుకొని తాము చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయించాడని.. వైసీపీ నేతల చర్యల వలన తాము తీవ్రంగా నష్టపోయామని పలువురు బాధితులు నేడు గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. అక్రమ కూల్చివేతలపై చర్యలు చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

అనంపురం జిల్లా సోమ అందెపల్లి మండలం పోలేపల్లికి చెందిన యలవ బుద్దప్ప నేడు గ్రీవెన్స్ లో విజ్ఞప్తి చేస్తూ.. తమ ఊరిలో పేదలకు చెందిన 450 ఎకరాలను వైసీపీ నేత నరసింహులు కబ్జాచేసి కంచె వేశాడని.. పొలం దగ్గరకు వెళితే పోలీసులతో కొట్టిస్తోన్నాడని.. వారి వలన 28 కుటుంబాలు బాధింప పడుతున్నాయని.. తమకు న్యాయం చేయాలని ఆయన నేడు గ్రీవెన్స్ నేతలుకు విన్నవించుకొన్నాడు.

ఆమెది పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం భీమవరమని.. వాళ్లకు నరసాపురం మండలం లింగబోయన చర్ల గ్రామ పంచాయితీ రామకూరిపాలెం గ్రామంలో కొంత భూమి ఉంటే మాజీ ఎమ్మెల్యే ముదునూరి అనుచరులు దాన్ని కొట్టేయడానికి కుట్రపన్నారని.. అన్ని ఆధారాలు ఉన్నా కాని.. సర్వేకి అప్లై చేస్తే నాడు రెవెన్యూ అధికారులు చాలా సార్లు రిజెక్ట్ చేశారని రెవెన్యూ అధికారుల తీరువలన తాము తీవ్రంగా నష్టపోయామని ఆమె గ్రీవెనస్ లో వాపోయారు. గత వైసీపీ ఎమ్మెల్యేకు తొత్తులుగా పనిచేసిన అధికారులపై చర్యలు తీసుకోని న్యాయం చేయాలని బాధితురాలు చామకూరి కుసుమ కుమారి పద్మావతి వాపోయారు.

ఎన్టీఆర్ జిల్లా ఏ. కొండూరు మండలం తూర్పు మాధవరం గ్రామానికి చెందిన పూల పుష్పావతి విజ్ఞప్తి చేస్తూ.. గత ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వే కారణంగా తమ భూమిని తక్కువ చేసి ఆన్ లైన్ లో ఎక్కించారని అసలు భూమి. 1ఎకరా 37 సెంట్లు ఉంటే ఎకరా12 సెంట్లు ఎక్కించారని.. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని.. వారి భూమిని ఆన్ లైన్ లో ఎక్కించడానికి గ్రామ సర్వేయర్ రమేష్ లంఛం డిమాండ్ చేసి తీసుకున్నాడని. ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన ఆకు తోట లక్ష్మీనరసింహారావు కూడా గ్రీవెన్స్ లో నేతలకు విజ్ఞప్తి చేస్తూ%ఔ% గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో తమ భూమిని కూడా తగ్గించి ఆన్ లైన్ చేశారని.. అధికారులకు మొరపెట్టున్నా వినడంలేదని.. దయ చేసి తమకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశాడు.

ఏలూరు జిల్లా పోలవరానికి చెందిన ఎండపు విఘ్నేశ్వరి విజ్ఞప్తి చేస్తూ.. చంద్రగూడెంలో తన భర్త తాతగారు కొన్న భూమిలోకి వెళ్లకుండా.. తమను కొంతమంది గిరిజనులు అడ్డుకుంటున్నారని... దీనిపై అధికారులు చుట్టా తిరగినా పట్టించుకోవడంలేదని.. వైసీపీ నాయకులు దీని వెనుక ఉండి నడిపిస్తోన్నారని వాపోయారు. తమకు ఆ పొలమే ఆధారమని. తమకు న్యాయం చేయాలని ఆమె వేడుకున్నారు.

గత 21 సంవత్సరాలుగా తమ సాగులో ఉన్న భూమికి దొంగపట్టాలు సృష్టించి తమ భూమిని కొట్టేయడానికి గుదె సుబ్బారావు, మిట్టా తిరుపతయ్యలు యత్నిస్తోన్నారని.. కనిగిరి మండలం చల్లగిరిగల గ్రామానికి చెందిన వీరనారాయణమ్మ గ్రీవెన్స్ లో మంత్రికి ఫిర్యాదు చేశారు. సాగు చేసుకొంటున్న భూమిలోకి వచ్చి దౌర్జన్యం చేస్తోన్నారని వాపోయారు.

తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తుపాకుల గూడెం గ్రామానికి చెందిన వుండవల్లి వెంకటలక్ష్మి నేడు గ్రీవెన్స్ లో విజ్ఞప్తి చేస్తూ.. గత 50 ఏళ్ల నుండి నేటికి బయ్యవరం గ్రామంలో 2ఎకరాల 50 సెంట్ల భూమి తన స్వాధీనంలో ఉందని.. వాస్తవానికి విరుద్ధంగా తళ్లపూడి రెవెన్యూ అధికారి యన్ వి యన్ కె ప్రసాద్ ఆ భూమి మరోకరిదిగా చెబుతున్నారని.. వాస్తవాలను పరిశీలించిన తమకు న్యాయం చేయాలని ఆమె వేడుకున్నారు.

పొన్నలూరు మండలం నాగిరెడ్డిపాలెంకు చెందిన గుమ్మళ్ల బ్రహ్మయ్య నేడు గ్రీవెన్స్ లో విజ్ఞప్తి చేస్తూ.. వంశపారపర్యంగా తమకు వచ్చిన భూమిలోకి తమను వెళ్లకుండా బెదిరిస్తోన్నారని.. భూమిని సాగు చేసుకోనివ్వడంలేదని... దీనిపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని.. తగిన విచారణ జరిపి న్యాయం చేయాలని ఆయన వేడుకున్నాడు.

కోర్టు ఉత్తర్వులు ఉన్నా... భోగస్ పత్రాలు సృష్టించి తమ భూమి 3 ఎకరాల 4 సెంట్లను కబ్జాచేసి కట్టడాలు ప్రారంభించారని.. ఈ భూ కబ్జా అక్రమ కట్టడాలపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని అనంతపురం జిల్లా కదిరికి చెందిన కె. సికింద‌ర్ గ్రీవెన్స్ లో వాపోయాడు.

విజయనగరం జిల్లా పూజపాటిరేగ మండలం కోనాడలో పలువురు వైసీపీ నేతలు పభుత్వ భూములను ఆక్రమించుకొని రేకుల షేడ్ లు వేశారని.. అంతేకాకుండా స్మశాన స్థలాన్ని కబ్జాచేసి రొయ్యల చెరువులు తవ్వారని.. ఈ ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవాలని వాసుపల్లి దినేష్ నేడు గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశాడు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు 750 గ్రామాల ప్రజలకు తాగునీటిని అందించే సత్యసాయి ప్రాజెక్ట్ ను గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని... ప్రాజెక్ట్ ను నిర్వీర్యం చేసి గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడేలా చేశారని అంతే కాకుండా.. టీడీపీ ప్రభుత్వంలో ప్రాజెక్ట్ నిర్వహణకు ఉన్న రూ. 2 కోట్ల 30 లక్షలను రూ. 1 కోటి 20 లక్షలకు తగ్గించిందని.. దాంతో ప్రాజెక్ట్ మెయింటెన్స్ సక్రమంగా లేదని గత ఆరు నెలలుగా కార్మికులకు జీతాలు కూడా ఇవ్వడంలేదని.. గత ఏడు నెలల నుండి పీఎఫ్, ఈఎస్ఐసీలు కార్మికుల ఖాతాలకు చెల్లించడంలేదని... దీనిపై %=ఔ% ఎస్సీ, డీఈలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని.. తమ సమస్యను పట్టించుకొని తమకు న్యాయం చేయాలని సత్యసాయి కార్మికులు నేడు గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు.

జి. ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తి తనకు మాయ మాటలు చెప్పి తన నుండి రూ. 25 లక్షలు కాజేశాడని.. అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని తిరుపతికి చెందిన పి. గౌతమ్ నేడు గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశాడు. అతని నుండి డబ్బులు ఇప్పించాలని వేడుకున్నాడు.

మదనపల్లి నియోజకవర్గం నిమ్మనపల్లి మండలానికి చెందిన పారపట్ల రమణప్ప విజ్ఞప్తి చేస్తూ.. మత్స్యకార సంఘ సభ్యులకు వలలు, బోట్ లు, ఐస్ బాక్స్ లు, చేప పిల్లలు, మోటార్ వాహనాలు సబ్సీడీ కింద ఇవ్వాలని గ్రీవెన్స్ లో మంత్రి, నేతలకు విజ్ఞప్తి చేశాడు.

**మంత్రి అనగాని మీడియాతో మాట్లాడుతూ..**

నూతన ప్రభుత్వం ఏర్పడిన తరువాత గత ఐదేళ్లలో జగన్ రెడ్డి ప్రభుత్వంలోని అరాచకాలను, అన్ని ఇబ్బందులను తొలగించడానికి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు గ్రీవెన్స్ కార్యక్రమం ఏర్పాటు చేయడం హర్షించ తగిన విషయం. గతంలో సామాన్యులు ముఖ్యమంత్రి, మంత్రులను సెక్రటేరియేట్ కు వెళ్లి కలవాలంటే సాధ్యపడేది కాదు. నేడు సీఎం నుండి మంత్రులు, నేతలందరూ ప్రజలందరికి అందుబాటులో ఉంటున్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు టీడీపీ పార్టీ కేంద్ర కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించి ఇది పేదల ప్రభుత్వమని నిరూపించారు. వాటి పరిష్కారానికి వచ్చే నెల నుండి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోన్నాం. భూ సమస్యలతో పాటు పింఛన్, రేషన్ కార్డు సమస్యల్లాంటి అనేక ఇష్యూలు వచ్చాయి. వచ్చిన ప్రతి అర్జీదారునికి న్యాయం చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం. పేదల ముఖాల్లో చిరునవ్వులు చూడటమే మా నాయకుడు లక్ష్యం.. దానికి తగినట్లు ప్రజలకోసం మేము పనిచేస్తోన్నాం.

# గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించండి

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. గ్రామ సభలు, ఉచిత ఇసుక విధానం అమలుపై బుధవారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లు, ఎస్పిలతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ముందుగా గ్రామ సభలపై సిఎస్ మాట్లాడుతూ ఉపాధిహామీ పై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, ఒక గ్రామం నుండి మరో గ్రామానికి, గ్రామం నుండి మండలాన్నికలిపే అనుసంధానం చేసే రహదార్ల నిర్మాణం వంటి మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఘణ, ద్రవ వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈగ్రామ సభలను ఉపయోగించాలని సిఎస్ కలక్టర్లకు స్పష్టం చేశారు. అందరు ప్రజా ప్రతినిధులు ఈగ్రామ సభల్లో పాల్గొనేలా చూడాలని అన్నారు. గ్రామ సభల నిర్వహణను జిల్లా కలక్టర్లు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయ వంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల సర్వతో ముఖాభివృద్ధికి దోహదపడే రీతిలో ఈగ్రామ సభలను విజయంతంగా నిర్వహించాలని అన్నారు.

రాష్ట్ర పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 23న గ్రామ సభల నిర్వహణకు సంబంధించి జారీ చేసిన మార్గదర్శకాలను తుఛ తప్పక పాటించాలని చెప్పారు. ముఖ్యంగా ఉపాధిహామీ పథకం అమలుకు సంబంధించి మంజూరైన పనులు, కొత్త పనుల గుర్తింపు, సామాజిక తనిఖీపై గ్రామ సభల ద్వారా ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించాలని చెప్పారు. అంతేగాక గ్రామాల్లో నూరు శాతం కనీస సేవలు కల్పించడం, పామ్ పాండ్ల నిర్మాణం, ఉద్యానవన, పట్టుపరిశ్రమలకు తోడ్పాటు అందించడం, పశు షెడ్ల నిర్మాణం వంటి వాటిపై కూడా చర్చించి వాటి కల్పనపై దృష్టి సారించాలని అన్నారు.

**సెప్టెంబరు 11 నుండి నూతన ఇసుక విధానం అమలు:సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్**

రాష్ట్రంలో సెప్టెంబరు 11 నుండి నూతన ఇసుక విధానాన్ని అమలులోకి తేనున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వెల్లడించారు. ఈ విధానం అమలుకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలను వెంటనే జారీ చేయడం జరుగుతుందని వాటిని తుచ:తప్పక పాటించాలని జిల్లా కలక్టర్లను ఆదేశించారు. ఎక్కడా ఇసుక అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక రీచ్ వారీగా ఇసుక తవ్వకం, రవాణాకు సంబంధించిన ధరలను కలక్టర్లు నిర్ధారించాలని ఆధరలకు మించి ఎక్కువ ధరకు విక్రయించినట్టు పిర్యాదులు వస్తే ఎంతమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. అంతేగాక ఆన్లైన్లో ఇసుక కోసం బుకింగ్ చేసిన వాహనాలకు ఏతేదీన ఏసమయంలో ఇసుకను తీసుకువెళ్లాలనేది స్పష్టంగా స్లాట్లు కేటాయించాలని అన్నారు. ఇసుక కోసం రిజిష్టర్ చేసిన వాహనాలను మాత్రమే ఇసుక రీచ్ ల్లోకి అనుమతించాలని ఇతర వాహనాలను ఎంతమాత్రం అనుమతించరాదని సిఎస్ స్పష్టం చేశారు. గుంటూరు జిల్లాకు సంబంధించి సీడ్ యాక్సిస్ రోడ్డు లోను, ఎన్టిఆర్ జిల్లాకు సంబంధించి నందిగామ వద్ద పెద్దఎత్తున లారీలు, ట్రక్కులు గంటల తరబడి వేచి ఉంటున్నట్టు గమనించామని అలాంటి పరిస్థితులు లేకుండా చూడాలని ఆరెండు జిల్లాల కలక్టర్లతో పాటు ఇతర కలక్టర్లకు సిఎస్ స్పష్టం చేశారు.

రాష్ట్ర భూగర్భ గనులశాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా మాట్లాడుతూ ఇసుక రీచ్ల నిర్వహణ, రవాణా, ధరల నిర్ధారణ అంశాలకు సంబంధించి కొన్ని గ్యాప్ లు ఉన్నయని వాటిని క్రమబద్దీకరిచేందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సెప్టెంబరు 11న నూతన ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తేనున్నట్టు ఆలోగా ఇసుక విధానాన్ని పూర్తిగా పటిష్టం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందని స్పష్టం చేశారు. గురువారం జిల్లాల్లో అందరు ట్రాన్సుపోర్టర్లను పిలిచి ఇసుక రవాణాకు వినియోగించే వాహనాల రిజిష్టర్ చేసి ఒక ప్రత్యేక యూనిక్ నంబరును కేటాయించాలని చెప్పారు. ఆనంబరు గల వాహనాలు మాత్రమే ఇసుక రవాణాకు ఉపయోగించాలని మరే ఇతర వాహనాలను ఇసుక రవాణాకు అనుమతించ రాదని స్పష్టం చేశారు. అంతేగాక ఇసుక తవ్వకం, రవాణాకు సంబంధించి రీచ్ లవారిగా వెంటనే ధరలను నిర్ణయించాలని చెప్పారు. ప్రతి రీచ్ వద్ద పోలీస్ చెక్ పోస్టును ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పిలను ఆదేశించారు. టోల్ ఫ్రీ నంబరుపై జిల్లాల్లో విస్తృత అవగాహన ప్రచారం చేయాలని అన్నారు. అదే విధంగా గురువారం సాయంత్రం 5గం.లకు జిల్లా కలక్టర్ల, ఎస్పిలు సంయుక్తంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఉచిత ఇసుక విధానంపై వివరించాలని మీనా చెప్పారు. ఇసుక విధానం అమలుకు సంబంధించి జిల్లా సంయుక్త కలక్టర్ ను కంట్రోలింగ్ అధికారిగా నియమించాలని అన్నారు. ఇసుక అక్రమ రవాణా, అక్రమ మైనింగ్ వంటివి జిల్లాల్లో ఎక్కడ జరిగినా అందుకు జిల్లా కలక్టర్, ఎస్పిలే బాధ్యత వహించాల్సి ఉంటుందని ముకేశ్ కుమార్ మీనా స్పష్టం చేశారు. ఈ వీడియో సమావేశంలో ఆర్థిక శాఖ కార్యదర్శి కెవివి. సత్యనారాయణ, భూగర్భ గనుల శాఖ కమీషనర్ ప్రవీణ్ కుమార్, వర్చుల్ గా జిల్లా కలక్టర్లు, ఎస్పిలు పాల్గొన్నారు

## రాజీవ్‌గాంధీకి మంత్రి సీతక్క నివాళులు



**జర్నలిస్ట్ ఫైల్** /హైదరాబాద్ : స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రజాభవన్‌లో ఆయన చిత్రపటానికి రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క మంగళవారం పూలమాల వేసి నివాళులు అర్పించారు.

### రాజీవ్ గొప్ప దార్శనికుడుః మంత్రి సురేఖ

మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ గొప్ప దార్శనికుడు అని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. రాజీవ్ గాంధీజయంతి సందర్భంగా ఆయన దేశానికి అందించిన సేవలను మంత్రి స్మరించుకున్నారు. ఐటి, టెలి కమ్యూనికేషన్స్, విద్య, వాణిజ్యం, రక్షణ తదితర రంగాల్లో ఆయన తెచ్చిన సంస్కరణలు దేశ ప్రగతిని పరుగులు పెట్టించాయని మంత్రి అన్నారు. నేడు ఐటి రంగంలో మన దేశం ప్రపంచంలోనే ఓ అగ్రగామి దేశంగా వెలుగొందడానికి, ప్రపంచవ్యాప్తంగా మన దేశ ఐటి నిపుణులకు గొప్ప అవకాశాలు లభించడానికి రాజీవ్ గాంధీ ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. అందుకే దేశం ఆయనను సమాచార విప్లవ పితామహునిగా కీర్తిస్తుందని మంత్రి సురేఖ తెలిపారు.

## గ్రూప్ 1 మెయిన్స్‌కు స్పోర్ట్స్ కోటాలో ఇద్దరు అభ్యర్థులు ఎంపిక

**జర్నలిస్ట్ ఫైల్**/హైదరాబాద్ : గ్రూప్ 1 మెయిన్స్‌కు స్పోర్ట్స్ కోటా కింద ఇద్దరు అభ్యర్థులను టిజిపిఎస్‌సి ఎంపిక చేసింది. జిఒ 74 ప్రకారం అధికారుల కమిటీ ఆధ్వర్యంలో ఇద్దరినీ ఎంపిక చేసినట్లు కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రూప్ 1కు స్పోర్ట్స్ కోటాలో నేషనల్, మల్టీనేషనల్ క్రీడల్లో హాజరైయినట్టు 36 మంది దరఖాస్తులు వచ్చాయని, అన్ని వివరాలు పరిశీలించిన తర్వాత కమిటీ సిఫార్సుల మేరకు ఇద్దరు అభ్యర్థులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ ఇద్దరు అభ్యర్థులు గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష ప్రారంభానికి ఒక వారం ముందు తమ హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని చేసుకోవచ్చని తెలిపారు. కాగా, అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలకు ఇప్పటికే షెడ్యూల్ విడులైన విషయం తెలిసిందే.

## హైదరాబాద్-కటక్ మధ్య ఎనిమిది ప్రత్యేక రైళ్ళు

**జర్నలిస్ట్ ఫైల్**/హైదరాబాద్ : ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్-కటక్-హైదరాబాద్ మధ్య ఎనిమిది ప్రత్యేక రైళ్ళను నడుపుతోంది. ఈ నెల 27 నుండి సెప్టెంబర్ 17 వరకు రైలు నెం. 07165 హైదరాబాద్ నుండి కటక్‌కు ప్రతి మంగళవారం నడుస్తుంది. ఈ నెల 28 నుండి సెప్టెంబర్ 18 వరకు రైలు నెం. 07166 కటక్ నుండి హైదరాబాద్ ప్రతి బుధవారం నడుస్తుందని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ ప్రత్యేక రైళ్ళు మార్గ మధ్యలో సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి,సామల్‌కోట్, అన్నవరం, అనకాపల్లి, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళంరోడ్, పలాస, బెర్హాంపూర్ ఖుర్దారోడ్ భువనేశ్వర్ స్టేషన్‌లలో ఆగుతాయి.

## రుణమాఫీపై ఎవరి మాటలు నమ్మాలో సిఎం చెప్పాలి: హరీశ్‌రావు డిమాండ్

**జర్నలిస్ట్ ఫైల్**/హైదరాబాద్: రుణమాఫీపై కాంగ్రెస్ నేతలు రోజుకో తీరుగా మాట్లాడుతున్నారని, ఎవరి మాటలు నమ్మాలో ముఖ్యమంత్రి చెప్పాలని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ హరీశ్‌రావు పేర్కొన్నారు. రుణమాఫీ కాక రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆందోళన చేస్తుంటే, సిఎం, మంత్రులు ఇష్టానుసారం మాట్లాడి గందరగోళం సృష్టిస్తున్నారని ఎక్స్ వేదికగా ఆరోపించారు. రుణమాఫీ జరిగి ఉంటే రైతులు ఆందోళన ఎందుకు చేస్తారని ప్రశ్నించారు. రుణమాఫీ పూర్తి కాలేదన్న వాస్తవాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ఒప్పుకుని రైతులకు క్షమాపణ చెప్పాలని, రుణమాఫీపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## హైకోర్టుకు చేరిన మహిళా కమిషన్ - వేణుస్వామి వివాదం

**జర్నలిస్ట్ ఫైల్**/హైదరాబాద్ : ప్రముఖ జ్యోతిష్కుడు వేణుస్వామి వివాదం హైకోర్టుకు చేరింది. ప్రముఖుల వ్యక్తిగత జీవితాల గురించి జాతకాల విశ్లేషణలు చేస్తూ తరచుగా వివాదాల్లో నిలిచే వేణు స్వామి తాజాగా మరో వివాదంలో చిక్కుకున్నారు. ఇటీవల వేస్వామి చేసిన వ్యాఖ్యలపై మహిళా కమిషన్ కి ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదును ఆధారంగా చేసుకుని వేణు స్వామికి మహిళా కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులను సవాల్ చేస్తూ వేణుస్వామి హైకోర్టులో పిటిషన్ వేశారు. వేణుస్వామి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు స్వామికి నోటీసులు ఇవ్వడానికి ఎలాంటి అర్హత ఉందని మహిళా కమిషన్‌ను హైకోర్టు ప్రశ్నించింది. దీని పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమాధానంగా వేణు స్వామి జ్యోతిష్యాల పేరుతో అసత్య వ్యాఖ్యలు చేస్తున్నాడని హైకోర్టుకు తెలిపారు. జీపీ సమాధానం విన్న హైకోర్టు తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

## విదేశాలకు వెళ్లాలి...అనుమతివ్వండి

### సిబిఐ కోర్టులో జగన్, విజయసాయిరెడ్డి పిటిషన్లు

**జర్నలిస్ట్ ఫైల్**/ అమరావతి : విదేశాలకు వెళ్లేందుకు అనుమతి కోరుతూ ఏపీ మాజీ సీఎం జగన్, ఎంపీ విజయసాయిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సీబీఐ కోర్టులో విచారణ జరిగింది. తదుపరి విచారణను న్యాయస్థానం వాయిదా వేసింది. విదేశీ పర్యటనకు వెళ్లేందుకు అనుమతివ్వాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి వేర్వేరుగా సీబీఐ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. జగన్ పిటిషన్‌పై కౌంటరు దాఖలుకు సీబీఐ సమయం కోరడంతో విచారణ బుధవారానికి వాయిదా పడింది. సెప్టెంబరులో యూకే వెళ్లేందుకు జగన్ అనుమతి కోరారు. విజయసాయిరెడ్డి పిటిషన్‌పై వాదనలు పూర్తి కాగా తీర్పు ఈ నెల 30కి వాయిదా పడింది. సెప్టెంబరు, అక్టోబరులో యూరప్ వెళ్లేందుకు విజయసాయిరెడ్డి అనుమతి కోరారు.

## బాలినేని పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో విచారణ వాయిదా

**జర్నలిస్ట్ ఫైల్**/ అమరావతి : ఈవీఎంల రీవెరిఫికేషన్ పై అభ్యంతరాలు ఉన్నాయంటూ వైసీపీ నేత, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. మాక్ పోలింగ్ వద్దని, 12 పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలలో ఓట్లు రీకౌంటింగ్ చేయాలని బాలినేని ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల సంఘం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో బాలినేని పిటిషన్ పై హైకోర్టు నేడు విచారణ చేపట్టింది. అభ్యంతరాలు ఉన్న ఈవీఎంలలోని ఓట్లను లెక్కించాలని, వాటిని వీవీ ప్యాట్లతో సరిపోల్చాలని బాలినేని తరఫు న్యాయవాది విన్నవించారు. మాక్ పోలింగ్ పై ఇప్పటికే ఉత్తర్వులు ఉన్నాయని ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది వివరించారు. వాదనలు విన్న అనంతరం హైకోర్టు ధర్మాసనం తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

## ఢిల్లీ ఆస్పత్రులకు బాంబు బెదిరింపు

**న్యూఢిల్లీ** : ఢిల్లీలోని ఎయిమ్స్, సఫ్దర్‌జంగ్ తదితర 50 ప్రభుత్వ ,ప్రైవేట్ ఆస్పత్రులతోపాటు ఒక మాల్‌కు మంగళవారం ఈ మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. నన్గ్లోయిలోని ఆస్పత్రి నుంచి మధ్యాహ్నం 1.04 గంటలకు, చాణక్యపురిలోని ప్రైమస్ ఆస్పత్రి నుంచి మధ్యాహ్నం 1.07 గంటలకు తమకు సమాచారం అందిందని ఢిల్లీ ఫైర్‌సర్వీస్ అధికారి చెప్పారు. అగ్నిమాపక వాహనాలు, బాంబు తనిఖీ బృందాలు, పోలీస్‌లు ఆయా ప్రాంతాలకు వెళ్లి తనిఖీ చేపట్టారని అయితే ఇంతవరకు ఎలాంటి అనుమానాస్పదమైనవి కనిపించలేదని అధికారులు చెప్పారు.

# మేం ఇచ్చింది రూ.18వేల కోట్లు మీరు పంచింది రూ.7500 కోట్లు

### రుణమాఫీ నిధుల విషయంలో బ్యాంకుల తీరుపై మంత్రుల పెదవి విరుపు

**జర్నలిస్ట్ ఫైల్** /హైదరాబాద్ : వ్యవసాయరంగానికి చేయూతగా రైతులను పంట రుణాల నుంచి విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం అందజేసిన నిధలను రైతుల ఖాతాలకు జమ చేయటంలో రాష్ట్రంలోని బ్యాంకర్ల తీరు పట్ల రాష్ట్ర మంత్రులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం, రైతాంగం బలోపేతం విషయంలో లెక్కలు కాదు ఆత్మపరిశీలన ఉండాలని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల రుణమాఫీ పథకం కోసం 18 వేల కోట్ల రూపాయలు బ్యాంకులకు చేర్చామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. రైతులకు మాత్రం నేటి వరకు 7500 కోట్ల రూపాయలు మాత్రమే చేరాయని తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంగళవారం జరిగిన 42వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి త్రైమాసిక సమీక్షా సమావేశానికి డిప్యూటీ సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మం త్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక సంవత్సరం రుణ లక్ష్యాలు, గత ఏడాది సాధించిన పురోగతి, రుణమాఫీ పథకం కింద నిధుల కేటాయింపులు వంటి అంశాలపై చర్చించారు. 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ప్రాధాన్యత రంగాల అడ్వాన్సుల విషయంలో వివిధ విభాగాల్లో బ్యాంకులు సానుకూల పనితీరు కనపరచడం పట్ల భట్టి




సంతోషం వ్యక్తం చేశారు. మొదటి త్రైమాసికంలోనే ప్రాథమిక రం గం కింద బ్యాంకుల్లో 40.62 శాతం వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా లక్ష్యం సాధించడం అభినందనీయమన్నారు. రాష్ట్రానికి వెన్నెముకగా వ్యవసాయ రంగం అన్నారు. రాష్ట్రం నగదు నిల్వల నిష్పత్తి మొదటి త్రైమాసికంలో 127. 29 శాతానికి మెరుగుపడడం మరో ఆసక్తికరమైన అంశమని భట్టి విక్రమార్క తెలిపారు. రాబోయే త్రైమాసికంలో నిర్దేశించిన రుణ ప్రణాళికను అధిగమించేందుకు బ్యాంకర్లు కృషి చేస్తారని ఆశిస్తున్నానంటూ దిశానిర్దేశం చేశారు. ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహంలో భాగంగా ఆయిల్‌పామ్ సాగుకు మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలను వేగంగా అభివృద్ధి చే యాలని నిర్ణయించిన క్రమంలో ఇప్పటికే రీజినల్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి చెప్పారు. వ్యవసాయ రంగం రాష్ట్రానికి వెన్నెముకగా భావిస్తున్న సర్కారు, రుణమాఫీ, రైతుభరోసా ద్వారా పెట్టుబడి సాయం, భారీ మధ్యతర సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం నిధులు కేటాయిస్తున్నామన్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో బృందం అమెరికా, కొరియా దేశాల్లో పర్యటించి 36 వేల కోట్ల రూపాయల విలువైన ఎంఓ‌యూలు కుదుర్చుకున్నారని చెప్పుకొచ్చారు.

### రుణ ఖాతాల్లో తప్పులు సరిదిద్దాలి

ఈ వర్షాకాలంలో అధిక విస్తీర్ణంలో పంటలు సాగవుతాయని ఆశిస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కష్టకాలంలో ప్రభుత్వం రుణమాఫీ పథకం కింద 18,000 కోట్ల రూపాయలు ఇప్పటికే విడుదల చేసిన దృష్ట్యా కింది స్థాయిలో పనిచేసే బ్రాంచ్ మేనేజర్లు రుణ ఖాతాల్లో తప్పులు సరిదిద్దేటట్లు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. బాధ్యతాయుతంగా వ్యవహరించి రుణమాఫీ కార్యక్రమం సంపూర్ణంగా పూర్తి చేయడానికి బ్యాంకుల సహకారం కావాలని మంత్రి తుమ్మల అన్నారు. అంకెలు చదువుకొని మూడు నెలలకోసారి సమావేశాలు పెట్టడం వల్ల బ్యాంకర్ల సదస్సు నిర్వహణకు అర్థం లేదని, అవి అంతిమ వినియోగదారుల ప్రయోజనాలు, నిమ్న వర్గాలు, లక్షిత వర్గాలకు ఆర్థిక ఫలాలు చేరేలా చేయాలని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో పాటు వివిధ శాఖల అధికారులు వివిధ బ్యాంకు ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాఖీ పండుగ నాడు కిక్కిరిసిన బస్సులు

### ఒక్కరోజే 64 లక్షల మంది ప్రయాణం

### వెల్లడించిన మంత్రి పొన్నం

**జర్నలిస్ట్ ఫైల్** /హైదరాబాద్ : రాఖీ పౌర్ణమి సందర్భంగా టిజిఎస్‌ఆర్‌టిసి రికార్డు స్థాయిలో 63.86 లక్షల మందిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసిందని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహాలక్ష్మి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్కరోజులో 41.74 లక్షల మంది మహిళలు వినియోగించారని వెల్లడించారు. 21.12 లక్షలమంది నగదు చెల్లించి బస్సుల్లో ప్రయాణం చేశారని పేర్కొన్నారు. రాఖీ పర్వదినం రోజున రికార్డు స్థాయిలో రూ. 32 కోట్ల రాబడి ఆర్‌టిసికి వచ్చిందన్నారు. అందులో మహాలక్ష్మి పథకం ద్వారా రూ.17కోట్లు, నగదు చెల్లింపు టికెట్ల ద్వారా రూ. 15 కోట్ల వరకు వచ్చిందని తెలిపారు. ఆర్‌టిసి చరిత్రలో ఒక్కరోజులో ఇంత మొత్తంలో ఆదాయం ఎప్పుడు రాలేదన్నారు. భారీ వర్షంలోనూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసిన ఆర్‌టిసి సిబ్బందిని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. ఆర్‌టిసి తన మొత్తం సామర్థ్యాన్ని ఉపయోగించుకుందని, ఉద్యోగులు రాత్రి, పగలు నిరంతరం శ్రమించారని వారి సేవలను కొనియాడారు. క్షేత్రస్థాయి సిబ్బందితో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుని రద్దీ ఉన్న రూట్లలో బస్సులు అదనంగా నడిపించి ప్రయాణికులను తరలించడంలో విజయవంతం అయ్యారన్నారు. రాఖీ పండగ ఉన్నప్పటికీ సిబ్బందికి నిరంతరం శ్రమించారని, ఆర్‌టిసి డ్రైవర్లు , కండక్టర్లకు కూడా ఫీల్డ్‌లోనే బస్సుల్లో వారి సోదరీమణులు రాఖీలు కట్టారని వారందరికీ అభినందనలు తెలిపారు. మహా లక్ష్మి పథకం ద్వారా ఆర్‌టిసిలో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించి సోదరులకు రాఖీ కట్టారని, వారందరినీ అభినందిస్తూ శుభకాంక్షలు తెలిపారు.

## ప్రతిపక్షాలకు మింగుడు పడని రుణమాఫీ

- ఏకకాలంలో 2 లక్షల రైతు రుణమాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్‌దే
- రుణమాఫీ కానివారు ఆందోళన చెందవద్దు
- రైతులు బిఆర్ఎస్, బిజెపి చట్రంలో పడొద్దు
- మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు

**జర్నలిస్ట్ ఫైల్** /హుస్నాబాద్ : రైతు రుణమాఫీ రాష్ట్రంలోని ప్రతిపక్షాలకు రుచించడం లేదని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా, హుస్నాబాద్ కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం నిర్వహించిన వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం నియోజకవర్గ ముఖ్య నేతలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలో లేనివిధంగా రైతులకు ఏకకాలంలో 2 లక్షల రైతు రుణమాఫీ చేసిన ఘనత సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రతిపక్షాలు రైతులను తప్పుదోవపట్టిస్తున్నాయని, రైతులు బిఆర్ఎస్, బిజెపి చట్రంలో పడవద్దని సూచించారు. ఇప్పటివరకు 2 లక్షల వరకు రైతు రుణమాఫీ పూర్తయిందని, ఎవరికైనా రుణమాఫీ కాకపోతే ఆందోళన చెందవద్దని హితవు పలికారు. మండల కార్యాలయాల్లో వ్యవసాయ అధికారులను కలిసి అప్లికేషన్ ఇవ్వాలని, సంబంధిత అధికారులు పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ అమలు అయ్యేలా చూస్తారని పేర్కొన్నారు. బిఆర్ఎస్ 10 ఏళ్లలో లక్ష రూపాయల రుణమాఫీ ఎన్ని విడతల్లో చేసి ఎంతమందికి ఇచ్చారని ప్రశ్నించారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రైతులకు ఏం చేసిందనేది రైతులకు చెప్పాలన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ 2 లక్షల వరకు రైతు రుణమాఫీ పూర్తి చేశామని, ఇచ్చిన మాట ప్రకారం మాటమీద నిలబడే ప్రభుత్వం తమదని అన్నారు. ప్రతిపక్షాలు లోన్లు మాఫీ కాలేదని అబద్ధాలు ఆడుతున్నారని విమర్శించారు. రైతు రుణమాఫీ 2018 డిసెంబర్ 12 కంటే ముందు, 2023 డిసెంబర్ 9 తరువాత లోన్ తీసుకున్న వారికి రుణమాఫీ వర్తించదని స్పష్టం చేశారు. సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ట్యాంక్‌బండ్‌పై పెట్టాలని



బిఆర్ఎస్ నేత కెటిఆర్ అంటున్నారని, పదేళ్ల అధికారంలో ఉండి కూడా విగ్రహం ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. తప్పకుండా పాపన్న విగ్రహం పెడతామని హామీ ఇచ్చారు. గత ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తెలంగాణలో అధికారం చేపట్టిన తర్వాత విజయవంతంగా అమలు చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహిళలకు ఆర్‌టిసి బస్సులో ఉచిత ప్రయాణంతోపాటు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500కే గ్యాస్ అందిస్తున్నామని తెలిపారు. ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇస్తుంటే మహిళలను అవమానపరిచే విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇవ్వడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదా అని ప్రశ్నించా రు. ఓ వైపు ఆటో కార్మికులను రెచ్చగొడుతూ పబ్బం గడుపుతున్నార న్నారు. 'మాజీ సిఎం కెసిఆర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇద్దరూ కలిసి కాంగ్రెస్‌ని విమర్శిస్తే మీకు మీరే అవమానపర్చుకున్నట్లేనని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

## బస్సులో పుట్టిన చిన్నారికి ఆర్టీసీ నజరానా

- జీవితకాలం ఉచిత బస్‌పాస్ మంజూరు
- కాన్పు చేసిన కండక్టర్, నర్సులకు ఏడాది పాటు ఉచిత ప్రయాణ సౌకర్యం

**జర్నలిస్ట్ ఫైల్** /హైదరాబాద్ : రాఖీ పౌర్ణమి నాడు గద్వాల డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సులో జన్మించిన చిన్నారికి జీవిత కాలంపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించేలా బస్ పాస్ ను అందిస్తున్నట్లు టిజిఎస్‌ఆర్‌టిసి యాజమాన్యం ప్రకటించింది. ఆర్‌టిసి బస్సులు, బస్‌స్టేషన్‌లలో పుట్టిన పిల్లలకు జీవిత కాలపు ఉచిత బస్‌పాస్ ఇవ్వాలని గతంలో యాజమాన్యం తీసుకున్న నిర్ణయం మేరకు ఈ ఆడపిల్లకు బర్త్ డే గిఫ్ట్ గా లైఫ్ టైం ఫ్రీ బస్‌పాస్ మంజూరు చేస్తున్నట్లు పే ర్కొంది. కండక్టర్‌తో పాటు గర్భిణీ డెలివరీకి సాయం చేసిన వనపర్తిలోని మదర్ అండ్ చైల్డ్ ప్రభుత్వ ఆసుపత్రి స్టాఫ్ నర్స్ అలివేలు మంగమ్మకు డిలక్స్, సూపర్ లగ్జరీ సర్వీసుల్లోనూ ఏడాది పాటు ఉచితంగా ప్రయాణించే బస్ పాస్‌ను సంస్థ అందించింది. బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణీకి కాన్పు చేసి మానవత్వం చాటుకున్న గద్వాల డిపోకు చెందిన కండక్టర్ భారతి, డ్రైవర్ అంజిలతో పాటు నర్సు అలివేలు మంగమ్మను హైదరాబాద్ బస్ భవన్‌లో మంగళవారం ఆర్‌టిసి యాజమాన్యం అభినందించింది. సంస్థ ఉన్నతాధికారులతో కలిసి సంస్థ ఎండి,విసి సజ్జనార్ వారిని ఘనంగా సన్మానించారు. నగదు బహుమతులు అందజేశారు. అనంతరం డిలక్స్, సూపర్



లగ్జరీ బస్సుల్లో ఏడాది పాటు ఉచితంగా ప్రయాణించే బస్‌పాస్‌ను నర్సు అలివేలు మంగమ్మకు, చిన్నారి ఉచిత బస్ పాస్‌ను గద్వాల డిపో మేనేజర్ మురళీ కృష్ణకు అందజేశారు.

గద్వాల-వనపర్తి రూట్ పల్లెవెలుగు బస్సులో రాఖీ పండుగ రోజు సోమవారం ఉదయం సంధ్య అనే గర్భిణి రక్షాబంధన్ సందర్భంగా తన సోదరులకు రాఖీ కట్టేందుకు వనపర్తికి వెళ్తున్నారు. బస్సు నాచహల్లి సమీపంలోకి రాగానే గర్భిణికి ఒక్కసారిగా పురిటినొప్పులు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన మహిళా కండక్టర్ జి.భారతి బస్సును ఆపించారు. అదే బస్సులో ప్రయాణిస్తోన్న నర్సు అలివేలు మంగమ్మ సాయంతో గర్భిణికి పురుడు పోశారు. పండంటి ఆడబిడ్డకు మహిళ జన్మనిచ్చారు. అనంతరం 108 సాయంతో తల్లీబిడ్డను స్థానిక ఆసుపత్రికి తరలించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి, సకాలంలో కాన్పు చేసిన కండక్టర్ భారతి, నర్సు అలివేలు మంగమ్మ డ్రైవర్ అంజీ సేవలను ఈ సందర్భంగా ఆర్‌టిసి ఎండి సజ్జనార్ మెచ్చుకున్నారు.

## పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అధిక నిధులు



- అన్ని హంగులతో రామప్పరిజర్వాయర్ అభివృద్ధి చేస్తాం
- రూ.90 కోట్ల నిధులతో శృతివనం ఏర్పాటుకు ప్రతిపాదన
- మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క

**జర్నలిస్ట్ ఫైల్** /ములుగు జిల్లా ప్రతినిధి : రాష్ట్రంలోని అన్ని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తోందని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, భూపాలపల్లి, వర్ధన్నపేట ఎంఎల్‌ఎలు గండ్ర సత్యనారాయణ రావు, నాగరాజుతో కలిసి ములుగు జిల్లా, వెంకటాపూర్ మండలంలోని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన శ్రీ రామలింగేశ్వర స్వామిని మంగళవారం ఆయన దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మంత్రులకు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికి వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ, జిల్లాలోని కాకతీయ కట్టడాలు అన్ని వ ర్గాల ప్రజలను ఆకట్టుకుంటున్నాయన్నారు. రానున్న రోజులలో ములుగు జిల్లా పర్యాటక ప్రాంతంగా మారిపోతుందని తెలిపారు. 800 ఏళ్ల క్రితం నిర్మించిన రామ ప్ప ఆలయం నేటికీ చెక్కుచెదరకుండా ఉందని, అప్పటి కాకతీయులు వారి మేధస్సుతో శిల్పాలను చెక్కి అద్భుతంగా అమర్చారని, ఇలాంటి కట్టడాలు నేటి సమయం లో కట్టడం ఎవరి తరం కాదని అన్నారు. ఇక్కడి ప్రాం తంలో పర్యటించే పర్యాటకులకు కనీస వసతులు కల్పించాలన్న ఉద్దేశంతో చర్యలు తీసుకుంటున్నామని, రా మప్ప సరస్సులో నీరు సమృద్ధిగా ఉండటం సంతోషకరమని అన్నారు. ఇక్కడి పర్యాటక ప్రాంతాలు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు పొందడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ. 90 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టాలని జిల్లా యంత్రాంగం ద్వారా మంత్రికి నివేదిక సమర్పించామని తెలిపారు. 14 సంవత్సరాల క్రితం లక్నవరంలో ఉయ్యాల వంతెన ఏర్పాటు చేయడంతో పర్యాటకులను అత్యధికంగా ఆకర్షిస్తోందని, అదే తరహాలో రామప్ప సరస్సులో ఉయ్యాల వంతెన ఏర్పాటు చేయాలని మంత్రి జూపల్లిని కోరారు. జిల్లాలోని రామప్ప, లక్నవరం సరస్సులు ఉండగా, మేడారంలోని శ్రీ సమ్మక్క సారలమ్మ ప్రాంతంలో స్మృతి వనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## త్రివర్ణ పతాకాన్ని ఖద్దరుతోనే నేయాలి

- ఖద్దరు జాతీయ గౌరవానికి ప్రతీక కావాలి
- కాంగ్రెస్ నేత సోనియా గాంధీ పిలుపు
- మోడీ ప్రభుత్వ పోలియెస్టర్ జెండా విధానంపై విమర్శ

**న్యూఢిల్లీ** : యంత్రంతో తయారు చేసిన పోలియెస్టర్ జెండాలను మోడీ ప్రభుత్వం ఆదరించడాన్ని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ మంగళవారం తీవ్రంగా ఆక్షేపించారు. త్రివర్ణ పతాకానికి విలక్షణతను చేకూర్చే వస్త్రంగా ఖద్దరును పునరుద్ధరించాలని సోనియా పిలుపు ఇచ్చారు. ఖద్దరు జాతీయ గౌరవానికి ప్రతీక కావాలని ఆమె ఉద్ఘాటించారు. సోనియా గాంధీ ఒక ప్రముఖ ఆంగ్ల దినపత్రికలో వ్యాసం రాస్తూ, 'స్వాతంత్ర్య దినోత్సవానికి వారం ముందు 'హర్ ఘర్ తిరంగ' ప్రచారోద్యమానికి ప్రధాని నరేంద్ర మోడీ తిరిగి పిలుపు ఇవ్వడం జాతీయ



పతాకంపైన, దేశానికి దాని ప్రాముఖ్యం గురించి సమష్టిగా పునరాలోకనానికి అవకాశం ఇస్తున్నదని పేర్కొన్నారు. 'ఆయన (మోడీ) ద్వంద్వ వైఖరితో ఒక వైపు జాతీయ పతాకానికి గౌరవం ఇస్తూనే, మరొకవైపు విరుద్ధ భావాలు గల సంస్థకు విధేయుడుగా ఒక ఎత్తు. చైనా, తదితర ప్రదేశాల నుంచి తరచు దిగుమతి చేసుకునే ముడి సరకుతో యంత్రం తయారీ పోలియెస్టర్ జెండాలను ఆమోదించడం మరొక ఎత్తు' అని ఆమె అన్నారు. జాతీయ పతాకాన్ని 'చేతితో వడికిన, చేతితో నేసిన ఉన్ని/ నూలు/ పట్టు ఖద్దరు వస్త్రం'తో రూపొందించాలని భారత పతాక నియమావళి చారిత్రకంగా కోరుతున్నదని సోనియా గుర్తు చేశారు. జాతీయోద్యమానికి తన సారథ్యంలో మహాత్మా గాంధీ స్వయం గా వడికిన, నేసిన ముతకదైనా, గట్టిదైన ఖద్దరు మన చారిత్రక, సాంస్కృతిక జ్ఞాపకాల్లో ప్రత్యేకత సంతరించుకున్నదని ఆమె పేర్కొన్నారు. ఖద్దరు మన గతానికి చిహ్నం అని, భారత ఆధునిక, ఆర్థిక పటిష్ఠతకు ప్రతీక అని సోనియా అన్నారు. '2022లో మన స్వాతంత్ర్యం 75వ వార్షికోత్సవం శుభ సందర్భంగా ప్రభుత్వం 'యంత్రం తయారీ పోలియెస్టర్ వస్త్రం, తోరణం'ను చేర్చేందుకు (2021 డిసెంబర్ 30 నాటి తన ఉత్తర్వు ద్వారా) పతాక నియమావళిని సవరించింది, అదే సమయంలో పోలియెస్టర్ జెండాలను జిఎస్‌టి నుంచి మినహాయించింది. ఆ విధంగా వాటికి ఖద్దరు పతాకాలకు వలె సమాన పన్ను స్థాయి తెచ్చింది' అని సోనియా తెలిపారు.

## స్వచ్ఛ బయో ఒప్పందంపై ఇడికి బిఆర్ఎస్ ఫిర్యాదు

**జర్నలిస్ట్ ఫైల్**/ హైదరాబాద్ : అమెరికా పర్యటనలో భాగంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బృందం స్వచ్ఛ బయో సంస్థతో రూ.1000 కోట్ల పెట్టుబడుల కోసం కుదుర్చుకున్న ఒప్పందం పై పరస్పర ప్రయోజనాలు ఉన్నాయని ఆరోపిస్తూ మంగళవారం బీఆర్ఎస్ ఈడీకి ఫిర్యాదు చేసింది. స్వచ్ఛ బయో, ప్రభుత్వం మధ్య కుదిరిన ఒప్పందంపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రతిపక్షం ఇచ్చిన ఫిర్యాదును ఈడీ స్వీకరించి, రసీదు ఇచ్చింది. స్వచ్ఛ బయో డైరెక్టర్‌లలో ఒకరు స్వయానా సీఎం సోదరుడు అనుముల జగదీశ్వర్ రెడ్డి ఉన్నారని, ఇది క్విడ్ ప్రోకో అని బీఆర్ఎస్ ఆరోపించింది. స్వచ్ఛ బయో డైరెక్టర్లలో ఒకరు అనుముల జగదీశ్వర్ రడ్డి కావడం ఆందోళన కలిగించే అంశమని, ఇది ఈ ఎంవోయూ చిత్తశుద్ధిని ప్రశ్నించే విధంగా ఉందని ఈడీకి రాసిన లేఖలో పేర్కొంది.

## రాష్ట్రంలో గృహాలు లేని వారందరికీ

# 2029లోపు గృహాలు కేటాయిస్తాం

### రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్థసారథి







**మచిలీపట్నం , ఆగస్టు 21, జర్నలిస్ట్ ఫైల్ :** రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలందరికీ వచ్చే 2029 సంవత్సరం నాటికి ఇల్లు కట్టించి ఇవ్వాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారధి పేర్కొన్నారు.మంగళవారం ఉదయం కంకిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలోని కంకిపాడు మండల హౌసింగ్ గోదామును మంత్రివర్యులు తనిఖీ చేశారు.గోదాములో ఉన్న గృహ నిర్మాణ సామాగ్రి నిల్వ రిజిస్టర్లు, పంపిణీ రసీదులు, తదితర రికార్డులు పరిశీలించారు. గోదాముకు ఎన్ని సిమెంట్ బస్తాలు వస్తున్నాయి, ఎన్ని టన్నుల స్టీల్ వస్తుంది, తలుపులు తదితర సామాగ్రి ఎంత మేరకు వస్తోంది ఎంతమందికి ఆ సామాగ్రిని పంపిణీ చేశారు తదితర వివరాలను మంత్రి హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కంకిపాడు గోదాముకు 1,16,881 బస్తాల సిమెంటు రాగా 1,16,182 బస్తాలు లబ్ధిదారులకు పంపిణీ చేశామని ఇంకా 699 బస్తాలు నిల్వ ఉన్నాయని అధికారులు మంత్రికి తెలిపారు.అలాగే 8,13,290 కిలోల స్టీలు అందగా 6,83,692 కిలోల స్టీలు పంపిణీ చేయగా 1,29,598 కిలోల స్టీలు నిల్వ ఉందన్నారు. అలాగే త, విద్యుత్తు, రంగులు తదితర సామాగ్రి 300 రాగా అందులో 249 పంపిణీ చేశామని ఇంకా 51 సామాగ్రి నిల్వ ఉన్నాయని హౌసింగ్ అధికారులు మంత్రికి వివరించారు.ఒక్కో ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులకు 90 బస్తాల సిమెంటు, 485 కిలోల స్టీలు దశలవారీగా అందజేయడం జరుగుతుందనని, లబ్ధిదారులకు ప్రభుత్వ మంజూరు చేస్తున్న 1.80 లక్షల రూపాయల లో పట్టుకోవడం జరుగుతుందని హౌసింగ్ అధికారులు మంత్రికి వివరించారు.గోదాముకు అందిన గృహ నిర్మాణ సామాగ్రి సజావుగా నమోదు చేసి అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని, నిల్వ వివరాలు ఏమాత్రం తేడా లేకుండా రికార్డులు పక్కాగా నిర్వహించాలని మంత్రి అధికారులకు సూచించారు.అనంతరం మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలో గృహ నిర్మాణం కోసం నిర్ణీత కాలవ్యవధి ప్రకారం లక్ష్యాలను నిర్దేశించామన్నారు.ఆ ప్రకారం ఈ సంవత్సరం 1.25 లక్షల గృహాల నిర్మాణం పూర్తి చేయాలని, వచ్చే ఆగస్టు మాసాంతంలోగా 7 లక్షల గృహాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇదివరకే మంజులైన ఇల్లులను పూర్తి చేసేందుకు అన్ని విధాల కృషి చేస్తామన్నారు. లబ్ధిదారులు కూడా వారికి మంజూరైన ఇల్లులను వచ్చే మార్చి మాసాంతంలోగా పూర్తి చేసుకోవాలని లేకపోతే వారికి తదుపరి ఎటువంటి ఆర్థిక సహాయం అందించే పరిస్థితి లేదని స్పష్టం చేశారు.ఇందులో భాగంగానే జిల్లాల వారీగా గోదాములను తనిఖీ చేసి అధికారులతో సమావేశాలు నిర్వహించి గృహ నిర్మాణ పురోగతిని సమీక్షించడం జరుగుతుందన్నారు.కంకిపాడు గోదామును రాష్ట్ర ఉన్నతాధికారులతో పాటు జిల్లా కలెక్టర్ తో కలిసి తనిఖీ చేసి గృహ నిర్మాణ సామాగ్రిని పరిశీలించడం జరిగిందన్నారు.పెనమలూరు శాసనసభ్యులు బోడె ప్రసాద్ కొన్ని సూచనలు చేశారని వాటిని పరిగణలోనికి తీసుకుంటామన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో వివిఎంసీ ఇల్లు నాణ్యతగా లేవని తమ దృష్టికి వచ్చిందని రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ఇళ్ళ నాణ్యతను తనిఖీ చేస్తామని ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ సంస్థకు బాధ్యతలు అప్పగిస్తున్నానున్నారు. గృహ నిర్మాణం మేనేజింగ్ డైరెక్టర్ చే ప్రత్యేక మైన విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం రాజకీయ కక్షతో టిడ్కో ఇళ్లను పూర్తిచేస్తే చంద్రబాబు నాయుడు గారికి ఎక్కడ మంచి పేరు వస్తుందని దురుద్దేశంతో పూర్తి చేయలేదన్నారు.ఈ సంవత్సరం టిడ్కో ఇళ్లను నూటికి నూరు శాతం పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగిస్తామన్నారు.ఈ తనిఖీలో మంత్రి వెంట రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి మెయిదిన్ దివాన్, మేనేజింగ్ డైరెక్టర్ పి రాజాబాబు, ఇంచార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, పెనమలూరు శాసనసభ్యులు బోడే ప్రసాద్, హౌసింగ్ సీఈ జి.వి.ప్రసాద్, ఎస్ ఈ లు జయ రామాచారి, నాగభూషణం కృష్ణ ఎన్టీఆర్ జిల్లాల హౌసింగ్ పీడీలు జీవీ సూర్యనారాయణ, రజిని, ఉయ్యూరు ఆర్డిఓ డి. రాజు, మార్కెటింగ్ ఏడి నిత్యానందం, గృహ నిర్మాణ సంస్థ ఈఈ ఎస్ వెంకటరావు, డి ఈ శివప్రసాదరావు, ఏఈ అబ్దుల్ జిలాని తదితర అధికారులు అనధికారులు పాల్గొన్నారు.

# కార్మిక రంగాన్ని సంక్షేమం వైపునకు నడిపిస్తాం

### మత్స్యకారుడు కుటుంబానికి రూ.5 లక్షల అందచేసిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్




**విజయవాడ, ఆగస్టు 21, జర్నలిస్ట్ ఫైల్ :** వైఎస్సార్సీపీ ప్రభుత్వం కార్మిక రంగాన్ని పట్టించుకోకుండా నిర్వీర్యం చేసిందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. ఇప్పుడు నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చారని కార్మిక రంగాన్ని సంక్షేమం వైపునకు నడిపిస్తామని చెప్పారు.తూర్పు నియోజకవర్గ పరిధిలోని 9వ డివిజన్ పటమటలంక గరికపాటి వారి వీధిలో నివాసి మత్స్యకారుడు మైలా వెంకటేశ్వరరావు ప్రమాదవశాత్తు మరణించగా వారి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అందచేసిన ఐదు లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే గద్దె రామమోహన్ వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులకు అందచేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ పేదలకు ఎంతో ఉపయోగంగా ఉండే చంద్రన్న భీమా పథకాన్ని వైఎస్సార్సీపీ ప్రభుత్వం అమలు చేయకపోవడం వల్ల చాలా మంది ఇబ్బంది పడ్డారన్నారు. వెంకటేశ్వరరావు గత ఏడాది చేపల వేటకు వెళ్ళి ప్రమాదవశాత్తు మరణించారని చెప్పారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోలేదని చెప్పారు. అందువల్ల ఈ సంఘటన జరిగి ఏడాదికి పైగా అయినా మానవతా దృక్పదంతో నారా చంద్రబాబు నాయుడు వెంకటేశ్వరరావు కుటుంబానికి రూ.5 లక్షలను అందచేశారని చెప్పారు. చంద్రన్న భీమా పథకం ద్వారా ఏవరైనా కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు మరణించిన వ్యక్తి పెద్దకర్మ జరిగేలోపునే అందచేశారని, మరణించిన వెంటనే రూ.10 వేలు అందచేసేవారని చెప్పారు. కార్మికులకు ఎంతో ఉపయోగంగా ఉండే భీమా పథకాన్ని వైఎస్సార్సీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎవ్వరూ ప్రవేశపెట్టినా అది మంచి పథకమని నారా చంద్రబాబునాయుడు భావించి అమలు చేశారని చెప్పారు. పేదల ఆరోగ్యానికి ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. అలాంటి కార్యక్రమాన్ని కూడా వైఎస్సార్సీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ఆసుపత్రులకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయకుండా ఆసుప్రతుల యాజమాన్యాలను ఇబ్బందులకు గురి చేసిందన్నారు. అందువల్ల వారు వివిధ రూపాల్లో ఆందోళలు చేసి నిరసన తెలియజేశారన్నారు. కార్మిక రంగంలోని నిధులన్ని మళ్ళించి కార్మిక రంగానికి వైఎస్సార్సీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పేదలకు కార్పోరేట్ వైద్యాన్ని మరింతగా చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పుడు ఆసుపత్రులకు గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను కొంచెం కొంచెంగా విడుదల చేస్తున్నారని చెప్పారు. కార్మిక రంగాన్ని మరింత సంక్షేమం వైపునకు తమ ప్రభుత్వం నడిపిస్తుందని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. చంద్రన్నభీమా పథకంతో పాటుగా కార్మికశాఖలోని నిధులతో కార్మికులకు మరింత సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి క్రాంతి శ్రీ, చెన్నుపాటి గాంధీ, యలమంచిలి దేవేంద్ర, నర్రా కిషోర్, అన్నాబత్తుల బాబి, చిలకలపూడి నరసింహారావు, అన్నాబత్తుల శ్రీదేవి, పలమనేని సుబ్బారావులతో పాటు మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# నిజాయితీ వ్యాపారానికి గుప్తా బ్రాండ్ అంబాసిడర్

### మార్కెటింగ్ యార్డ్ మాజీ చైర్మన్ : మరకానీ పరబ్రహ్మం



**మచిలీపట్నం ఆగస్టు 21, జర్నలిస్ట్ ఫైల్ :** నగరంలో 25 సంవత్సరాలు పాటు ఎలక్ట్రిక్ రంగంలో వ్యాపారం చేసిన మామిడి మల్లికార్జున గుప్తా నీతి నిజాయితీకి బ్రాండ్ అంబాసిడర్ గా నిలిచారని, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మరకాని పరబ్రహ్మం అన్నారు. మల్లికార్జున గుప్తా ప్రథమ వర్ధంతి సందర్భంగా స్థానిక మెయిన్ రోడ్ లో ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాన్ని న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మంగళవారం ప్రారంభించారు.

మరకాని పరబ్రహ్మం మాట్లాడుతూ కష్టమర్ల యొక్క నమ్మకాన్ని పెంపొందించే విధంగా తన వ్యాపారాన్ని కొనసాగించిన మల్లికార్జున గుప్తా ఇతర వ్యాపారస్తులకు ఆదర్శప్రాయం అని అన్నారు. విజయవాడ ధరలకే ఎలక్ట్రికల్ వస్తువులను నగర, చుట్టుపక్కల ప్రజలకు అందించి వ్యాపారంలో తనదైన శైలిలో నిర్వహించిన మల్లికార్జున గుప్తా చిన్న వయసులో మరణించడం బాధాకరమని లంకిశెట్టి బాలాజీ అన్నారు. అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు వల్లపోతు సుబ్రహ్మణ్యేశ్వర రావు మాట్లాడుతూ మచిలీపట్నం మార్కెట్లో గుప్తా తనకంటూ ప్రత్యేకతను నిలుపుకున్నారని, గుప్తా పేరు మీద పేదలకు అన్నదానం నిర్వహించడం గొప్ప విషయమ న్నారు. మామిడి మల్లికార్జున గుప్తా సోదరులు కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ మామిడి మురళీకృష్ణ మాట్లాడుతూ మల్లికార్జున గుప్తా తమ్ముడు గా జన్మించటం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు అన్న బాటలో వ్యాపారం కొనసాగిస్తున్నానన్నారు . ఈ కార్యక్రమంలో పలువురు వర్తకులు, ఎలక్ట్రీషియన్లు పాల్గొన్నారు. దాదాపు 500 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# విజయవాడలో మినీ జాబ్ మేళా..!

**విజయవాడ, ఆగస్టు 21, జర్నలిస్ట్ ఫైల్ :** విజయవాడ(ఎన్టీఆర్ జిల్లా) – ఈ నెల 22వ తేదీన అనగా గురువారం జిల్లా ఉపాధి కార్యాలయంలో మినీ జాబ్ మేళా ప్రభుత్వ ఐటిఐ కాలేజి ఆవరణలో జిల్లా ఉపాధి కల్పన శాఖ మరియు జిల్లా నైపుణ్యా భివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మినీ బాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు ఒక ప్రకటన లో తెలియజేశారు. ఈ జాబ్ మేళాను ఉమ్మడి కృష్ణ జిల్లా నిరుద్యోగ యువతీ,యువకులు సద్వినియోగపరుచుకోవాలని ఆయన కోరారు.ఈ మిని బాబ్ మేళాలో జీనియస్,ఎస్ఐఎస్ లిమిటెడ్,డిమార్ట్, ఫ్లిప్ కార్ట్,విజేత,హాయ్ బ్లూ మొడ్యూలేటర్ తదితర కంపెనీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టుగా తెలిపారు. కావున జిల్లాలోని పదవ తరగతి ఐటిఐ డిప్లమా మరియు ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 18 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల లోపు నిరుద్యోగుల పూర్తి బయోడేటా ధృవ పత్రాలు జిరాక్స్ కాపీలు ఆధార్ కార్డుతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు.ఎంపికైన అభ్యర్థులకు 12 వేల నుండి 20వేల వరకు వేతనం లభిస్తుందని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు www.ncs.gov.in వెబ్ సైట్లో వివరములు నమోదు చేసుకోగలరని తెలిపారు.ఇతర వివరములకు 8142416211 (వాట్సప్ కాల్ మాత్రమే)నెంబర్ ను సంప్రదించవచ్చని తెలిపారు.

## అమ్మవారి చల్లని దీవెనతో

# రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలి

– రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి





**నూజివీడు, ఆగస్టు 21, జర్నలిస్ట్ ఫైల్ :** నూజివీడు నియోజకవర్గం ఆగిరిపల్లి మండలం చిన ఆగిరిపల్లి గొల్లగూడెం లో వేంచి ఉన్న శ్రీ శ్రీ కృష్ణదుర్గాదేవి అమ్మ వారిని సోమవారం రాత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసం బంధాల శాఖ మంత్రివర్యులు శ్రీ కొలుసు పార్థసారధి మంత్రివర్యులకు తొలుత వేదపండితులు అర్చకులు పీఠాధిపతివారు మేల తాళలతో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికిన తదనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి దుశ్శాలువతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనం చేసిన పండితులు తదనంతరం మంత్రివర్యులు శ్రీ కొలుసు పార్థసారధి మాట్లాడుతూ శ్రీ కృష్ణ దుర్గా అమ్మవారి కరుణా కటాక్షంతో జిల్లా రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో సుభిక్షంగా జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి తద్వారా రాష్ట్ర రైతాంగం అంతా పాడి పంటలతో వర్ధిల్లాలని అన్నారు అమ్మవారు ఎంతో మహిమ గల దైవం అని కోరిన కోర్కెలు వెంటనే చిద్దించునని తెలిపారు అమ్మవారి కరుణా కటాక్షంతో ఆగిరపల్లి గొల్లగూడెం రైతులు మరియు గొర్రెలు, మేకలు, ఆవులు, గేదలు, పశు సంపద అంతా దిన దిన అభివృద్ధి చెంది తద్వారా ప్రజలంతా ఆర్థికంగా బలపడాలని ఆకాంక్షించారు అమ్మవారి దయతో రాష్ట్ర ప్రజలు రోగ్యం,అష్టైశ్వర్యాలతో సంతోసధాయకమైన జీవితం గడపాలని అన్నారు అలాగే అమ్మవారి దీవెన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మెండుగా ఉండాలని తద్వారా మంచి పరిపాలన అందించాలని అన్నారు మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత బహుళ జాతి పరిశ్రమలు మన రాస్త్రానికి తరలి వస్తున్నాయని త్వరలో వాటిని నెలకొల్పడం ద్వారా యువతీ యువతకు లక్షల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు వచ్చి రాష్ట్రం ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు అపార అనుభవం దూరదృష్టి చిత్తశుద్ధి కల్గిన ఆర్థిక నిపుణుడైన మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి గా శ్రీ నారా చంద్రబాబు నాయుడు రాకతో రాష్ట్రం సంక్షేమం అభివృద్ధిలో ముందుకెళుతుందని అన్నారు అలాంటి నాయకుడికి ఎల్ల వేళలా అమ్మవారి కరుణా కటాక్షం ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ ప్రెసిడెంట్ శ్రీనివాసు, పండితులు గ్రామ తెలుగుదేశం జనసేన బి జె పి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీ నూతన విద్యార్థులకు

# నేటి నుండి తరగతులు

**నూజివీడు, ఆగస్టు 21, జర్నలిస్ట్ ఫైల్ :** ఆర్జీయూకేటీ నూజివీడు,2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి మరియు రెండవ జనరల్ కౌన్సిలింగ్ లోనూజివీడు క్యాంపస్ కు ఎంపిక కాబడిన విద్యార్థులకు బుధవారం నుండి తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఆచార్య ఎం .చంద్రశేఖర్ నూజివీడు క్యాంపస్ నిర్దేశకులు తెలియజేశారు.

## భక్త ఆంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కామినేని





**కైకలూరు, ఆగస్టు 21, జర్నలిస్ట్ ఫైల్ :** ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం కైక లూరు మండలం రాచపట్నం గ్రా మానికి చెందిన యలవర్తి రంగా రావు, అభిమాన నాయకులు మాజీ మంత్రివ ర్యులు, కైకలూరు శాసనసభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్ విజయం సాధించిన సందర్భంగా రాచపట్నంలో గల భక్తాంజ నేయ స్వామి గుడి వద్ద 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భం గా ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీనివాస్ ఘ నంగా సన్మానించడం జరిగినది. ఈ కార్యక్ర మానికి టిడిపి ఇన్చార్జ్ వీరమల్లు నరసింహా రావు, జనసేన నాయకులు కొల్లు బాబి, మరియు టిడిపి బిజెపి జనసేన నాయకులు భారీ ఎత్తున పాల్గొనడం జరిగినది.

## నేడు నూజివీడులో

# మెగా రక్తదాన శిబిరం

**నూజివీడు, ఆగస్టు 21, జర్నలిస్ట్ ఫైల్ :** నూజివీడులోని రాజీవ్ సర్కిల్ వద్ద గల జనసేన పార్టీ కార్యాలయం రేపు ఉమ్మడి కృష్ణా జిల్లా చిరంజీవి యువత ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు అభిమానులు తెలిపారు. ఈనెల 22న చిరంజీవి బర్త్ డే సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరంలో మెగా అభిమానులు, జన సైనికులు, వీర మహిళలు భారీగా పాల్గొని రక్తదానం చేయాలని ఉమ్మడి కృష్ణాజిల్లా చిరంజీవి యువత కార్యదర్శి సత్రపు సుదీర్ ఈ సందర్భంగా సూచించారు.

≡ క్విక్ బైట్స్



## 'హైడ్రా'ను రాష్ట్రమంతా విస్తరించండి

**సీఎంకు ముదిరాజ్ మహాసంఘం విజ్ఞప్తి**

ఖైరతాబాద్, ఆగస్టు 21 'హైడ్రా' లాంటి సంస్థలను రాష్ట్రమంతా విస్తరించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసంఘం సీఎం రేవంత్ రెడ్డిని కోరింది. మంగళవారం ప్రెస్ క్లబ్ లో జరిగిన మీడియా సమావేశంలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్ మాట్లాడారు. 'హైడ్రా'ను హైదరాబాద్ కే పరిమితం చేయకుండా రాష్ట్రమంతా విస్తరించి రంగనాథ్ వంటి సమర్థమంతమైన అధికారికి బాధ్యతలను అప్పగించాలన్నారు. 'హైడ్రా' ఏర్పాటుతో సిటీ ప్రజలతో పాటు రాష్ట్రంలోని 50 లక్షల మంది మత్స్యకారులు ఆనందంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి గొడుగు శ్రీనివాస్, సంఘం నాయకులు ఉప్పరవేణి రంజిత్, సుంకర బొయిన మహేశ్, చెరుకు సాంబరాజు పాల్గొన్నారు.

# రూ.2లక్షలకు పైగా ఉన్న రుణాల మాఫీకి గైడ్‌లైన్స్!

## రైతులకు వెసులుబాటు కల్పించేందుకు సర్కారు యోచన

### వారంలోగా స్పష్టత ఇవ్వనున్న వ్యవసాయశాఖ

హైదరాబాద్, జర్నలిస్ట్ ఫైల్

ఇప్పటి వరకు రూ.2 లక్షల క్రాప్‌లోన్ల మాఫీ ప్రక్రియ చేపట్టిన సర్కారు.. ఆపై ఉన్న పంట రుణాల మాఫీకి గైడ్‌లైన్స్ సిద్ధం చేస్తున్నది. మరో వారం రోజుల్లో రూ.2 లక్షలకు పైగా ఉన్న పంట రుణాలపై స్పష్టత ఇచ్చేందుకు వ్యవసాయశాఖ సమాయత్తమవుతున్నది. రూ.2 లక్షల కంటే ఎక్కువ ఉన్న రుణాలను చెల్లించేందుకు గడువు పెట్టే యోచనలో ఉన్నది. నిర్ణయించిన రూ.2 లక్షల కంటే ఎంత ఎక్కువ రుణాలు ఉన్నాయనే దాన్ని బట్టి కాలపరిమితి విధించి, రైతులు బ్యాంకు అప్పులు చెల్లించుకునే వెసులుబాటు కల్పించనున్నది. ఎక్కువ అమౌంట్ చెల్లించాల్సిన రైతులకు కొంత ఎక్కువ గడువు ఇచ్చే అవకాశం కనిపిస్తున్నది. కుటుంబం యూనిట్‌గా ఉండే ఈ రుణమాఫీలో కుటుంబ సభ్యుల్లో మహిళల లోన్లకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు సమాచారం.

**రైతులను రుణ విముక్తులు చేసే దిశగా అడుగులు**

రూ.2 లక్షలకు పైగా రుణం ఉన్న రైతులకు వెసులుబాటు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తున్నది. 2 లక్షల కంటే ఎక్కువ ఉన్న రుణాలను చెల్లించేందుకు గడువు పెట్టే యోచనలో ఉన్నది. రైతులను పూర్తిస్థాయిలో రుణ విముక్తులను చేసే క్రమంలో నిర్ణీత రూ.2లక్షల కంటే క్రాప్‌లోన్లు ఎక్కువ ఉంటే .. రైతులు పై మొత్తం చెల్లించిన తర్వాతే రుణమాఫీ చేస్తామని సర్కారు ఇప్పటికే స్పష్టం చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన ఐదేండ్లలో చేయాల్సిన పంట రుణమాఫీలో దాదాపు సగం చేయకుండా ఎగ్గొట్టింది. ఈ ఎగ్గొట్టిన రూ.9 వేలకోట్లకు పైగా ఉన్న పంట రుణాలను రైతులు రెన్యూవల్ చేసుకోవడంతో ఇప్పుడవి 60 శాతానికి పైగా ఉన్నాయి. రూ.2 లక్షలకు పైగా ఉన్న పంట రుణాల జాబితాలో చేరిపోయాయి. ఈ నేపథ్యంలో రూ.2 లక్షలకు పైగా లోన్ ఉన్న రైతులకు పంట రుణమాఫీ చేసేందుకు సర్కారు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తున్నది.



**రూ.2 లక్షలలోపు రుణం ఉన్న రైతుల నుంచి వివరాల సేకరణ**

ఇప్పటివరకు రుణమాఫీ చేసిన రూ.2 లక్షల రుణాల్లోనూ వివిధ కారణాలతో మాఫీ కాని రైతుల సమస్యలను పరిష్కరించడానికి, ఫిర్యాదు చేసుకోవడానికి నెల గడువు ఇచ్చిన విషయం తెలిసిందే. రైతుల నుంచి అగ్రికల్చర్ అధికారులు ప్రత్యేక ఫార్మాట్‌లో 9 రకాల వివరాలు రాతపూర్వకంగా తీసుకోవడంతోపాటు మరో 5 రకాల ధ్రువీకరణ పత్రాలను సేకరిస్తున్నారు. రూ.2 లక్షల వరకు మాఫీ కాని రైతుల నుంచి ఫిర్యాదులు తీసుకుంటూ.. మాఫీ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. మరో పక్క రూ.2లక్షల కంటే ఎక్కువున్న రుణాలను మాఫీ చేసేందుకు సర్కారు సన్నాహాలు చేస్తున్నది.

## హైడ్రా పేరుతో కూల్చివేతలు ఆపకుంటేే ఉద్యమిస్తం

- పర్మిషన్ ఇచ్చిన ఆఫీసర్లపై చర్యలుండవా?: ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



హైదరాబాద్, ఆగస్టు21 హైడ్రా పేరుతో నగరంలో చేస్తున్న కూల్చివేతలను ఆపకపోతే ప్రజల తరఫున పోరాడుతామని బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి తెలిపారు. హైడ్రా ఆలోచన బాగుందని, కానీ ఆచరణ సాధ్యం కావడం లేదన్నారు. దీనివల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. అక్రమంగా కబ్జాచేసి కట్టిన కట్టడాలను కూల్చడం సబబేనని, కానీ కట్టడాలకు గతంలో ప్రభుత్వం ఎలా అనుమతి ఇచ్చిందని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్థిక స్తోమతను దృష్టిలో పెట్టుకుని తక్కువ ధరకు వచ్చే చోట ప్రజలు ఇండ్లు కొనుగోలు చేశారని తెలిపారు. అయితే, ఇప్పుడు అవి బఫర్ జోన్ లో ఉన్నాయనే కారణంతో కూలిస్తే వారి పరిస్థితి ఏంటని నిలదీశారు. భూములు కొనుగోలు చేసే సమయంలో చాలామందికి అది ఏ పరిధిలో ఉన్నందనే విషయం తెలియదన్నారు. కేవలం హెచ్ఎండీఏ పరిధిలోకి వస్తుందా.. లోన్ వస్తుందా అని మాత్రమే చూశారని చెప్పారు.

**పర్మిషన్స్ ఎవరు ఇచ్చారు?**

అసలు బఫర్ జోన్ లో భూముల అమ్మకానికి, కొనుగోళ్లకు, ఇండ్ల నిర్మాణానికి పర్మిషన్స్ ఎవరు ఇచ్చారో తేల్చాలని వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. 'రియల్టర్లకు అనుమతులు ఎవరిచ్చారు.. లేఔట్ వేసేందుకు పర్మిషన్ ఇచ్చిందెవరు.. బఫర్ జోన్లు, చెరువులు, శిఖం భూములని తెలియకుండా ప్రభుత్వ అనుమతులు లేకుండానే రియల్టర్ల చేతుల్లోకి వెళ్లాయా" అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి తెలియకుండానే ఎఫ్‌టీఎల్ ప్రకారం డాక్యుమెంట్లు ఎలా తయారయ్యాయన్నారు. అనుమతి లేకుండానే లేఔట్లు ఎలా అయ్యాయో.. నిర్మాణంతో పాటు ప్లాట్లు ఎలా అమ్ముడయ్యాయో హైడ్రా చైర్మన్ సీఎం రేవంత్ రెడ్డి, కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇష్టారీతిన డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై చర్యలు ఉండవా అని ప్రశ్నించారు. సామాన్యుల బతుకులు కూల్చడం తప్పా హైడ్రా కొత్తగా సాధించిందేమీ లేదని వెంకటరమణారెడ్డి విమర్శించారు.

## మేఘా సంస్థ తప్పిదాలన్నింటిపై చర్యలు తీసుకోవాలి

- సుంకిశాల ఘటనలో ఆ కంపెనీకి షోకాజ్ మా విజయమే: మహేశ్వర్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు21 మేఘా ఇంజినీరింగ్ కంపెనీ చేసిన తప్పిదాలన్నింటిపైనా రాష్ట్రప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. సుంకిశాల ఘటనలో ఆ కంపెనీకి షోకాజ్ నోటీసులు ఇవ్వడం బీజేపీ విజయమన్నారు. అక్కడ తప్పు జరిగింది కాబట్టే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశామని తెలిపారు. మంగళవారం అసెంబ్లీ మీడియా హాల్ లో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి సర్కారులో కొత్త సమస్య మొదలైందని, ముఖ్యమంత్రి పీఠంపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కన్నేశారని ఆయన ఆరోపించారు. కర్నాటకలో డీకే శివకుమార్ తరహాలో తెలంగాణలో పొంగులేటి మారారని చెప్పారు. ప్రభుత్వంలో భట్టి విక్రమార్క కంటే పవర్ ఫుల్ సెంటర్ గా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్‌లో కుర్చీలాట నడుస్తోందని, రేవంత్ రెడ్డి తర్వాత నెంబర్ 2 కోసం తెరచాటు ప్రయత్నాలు చేస్తున్నారని వెల్లడించారు. సీఎం సొంత ఏరియాలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కంపెనీకి పాలమూరు ప్రాజెక్టులో సగం వర్క్స్ ఇచ్చారని, కొడంగల్ ప్రాజెక్టు కూడా సీఎం చెప్పిన కంపెనీకి కాకుండా పొంగులేటి కంపెనీకి ఇచ్చారని ఆరోపించారు. పొంగులేటితో 20 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారన్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇల్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని మీడియాలో చూశానని, దీనిపై నిజనిర్ధారణ చేసుకోవాల్సిన బాధ్యత ఆయనపైనే ఉందని మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా వెంకటస్వామి బాధ్యతలు

- సోనియా, రాహుల్, ఖర్గేకు కృతజ్ఞతలు

హైదరాబాద్, ఆగస్టు 21 ఎన్ఎస్ యూఐ స్టేట్ ప్రెసిడెంట్ గా యడవల్లి వెంకటస్వామి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గాంధీ భవన్ కు ర్యాలీగా వచ్చి ఛాంబర్ లో ఎమ్మెల్సీ, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ సమక్షంలో వెంకటస్వామి బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎన్ఎస్ యూఐ ఇన్ చార్జ్ ప్రహ్లాద్ తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. అనంతరం గాంధీభవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెంకటస్వామి మాట్లాడారు. ఒక సామాన్య కార్యకర్తను ఎన్ఎస్ యూఐ విభాగానికి అధ్యక్షుడిగా నియమించినందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వెంకటస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, ఆగస్టు 21 అనధికారిక లేఔట్ల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వానికి హైకోర్టు మంగళవారం నోటీసులు జారీ చేసింది. లేఔట్ల క్రమబద్ధీకరణ నిమిత్తం పురపాలకశాఖ జులై 30న జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను సవాలు చేస్తూ కరీంనగర్‌కు చెందిన జువ్వాడి సాగర్‌రావు హైకోర్టులో పిల్ వేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. భూమి విలువ ఆధారంగా నిర్మాణాలకు అనుమతి మంజూరుకు ముందు లేఔట్‌ల క్రమబద్ధీకరణ ఫీజు వసూలు చేయడం చట్టవిరుద్ధమన్నారు. ఇది తెలంగాణ పట్టణ ప్రాంతాల అభివద్ధి చట్టం, జీహెచ్ఎంసీ చట్టం, తెలంగాణ టౌన్‌ప్లానింగ్ చట్టం, హెచ్ఎండీఏ చట్టాలకు విరుద్ధమన్నారు. ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని, ఇప్పటికే జారీ చేసిన అనుమతులను కూడా కొట్టేయాలని కోరారు. వాదనలను విన్న ధర్మాసనం ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.



## రుణమాఫీ ఎప్పటిలోపు పూర్తి చేస్తరు: జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 21 రుణమాఫీ ఎప్పటిలోపు పూర్తి చేస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇంకా 17 లక్షల మందికి రుణమాఫీ చేయాల్సి ఉన్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. వాళ్లందరికీ ఎప్పటిలోపు రుణమాఫీ పూర్తి చేస్తారో కూడా చెప్పాలని నిలదీశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. "17 లక్షల మందికి రుణ మాఫీ చేయలేదని స్వయంగా మంత్రి ఉత్తమ్ ఒప్పుకున్నారు. రూ.31 వేల కోట్లు రుణమాఫీ చేయటానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఏ తేదీలోపు చేస్తారో స్పష్టంగా హామీ ఇవ్వాలి. లేకుంటే ప్రతిపక్షంగా మా తడాఖా ఏంటో చూపిస్తాం" అని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు.

## బీసీలు రాజకీయంగా ఏకం కావాలి

- పీసీసీ చీఫ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్ల కురుమలకు ఇవ్వాలి: అంజన్ కుమార్ యాదవ్



హైదరాబాద్, ఆగస్టు 21 రాజకీయంగా బీసీలకు రావాల్సిన వాటా రావడం లేదని మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ అన్నారు. బీసీలంతా రాజకీయంగా ఏకమై తమ వాటా కోసం పోరాడాలని ఆయన సూచించారు. పీసీసీ చీఫ్ లేదా వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని గొల్ల కురుమలకు ఇవ్వాలని ఏఐసీసీ నేతలను ఆయన కోరారు. మంగళవారం హైదరాబాద్ ఆదర్శ్ నగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో కాంగ్రెస్ పార్టీ యాదవ, కురుమ ముఖ్య నేతలు మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ అధ్యక్షతన సమావేశమయ్యారు. ఈ మీటింగ్‌లో మేడ్చల్ కాంగ్రెస్ ఇన్ చార్జ్ తోటకూర జంగయ్య యాదవ్, పీసీసీ జనరల్ సెక్రటరీ చరణ్ కౌశిక్ యాదవ్, అధికార ప్రతినిధులు గౌరీ సతీశ్ యావవ్, లోకేశ్ యాదవ్, పీసీసీ సెక్రటరీలు రాజేశ్, గడ్డం శేఖర్ యాదవ్, సర్పంచ్ ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సాధని భూమన్న యాదవ్, మాజీ కార్పొరేటర్ కల్పన యాదవ్, కాంగ్రెస్ నేత మధుకర్ యాదవ్ పాల్గొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లు గొల్ల కురుమలను విస్మరించిందన్నారు. గొర్లు, చేపలు ఇచ్చి కోటీశ్వరులను చేసినట్టు ప్రచారం చేసుకుందని అంజన్ కుమార్ యాదవ్ మండిపడ్డారు. బీసీల్లో ఎక్కువ శాతం ఉన్న గొల్ల కురుములకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కేబినెట్ లో ఒక బెర్త్, రెండు ఎమ్మెల్సీ సీట్లు, జడ్పీ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, మార్కెట్ కమిటీలు, కార్పొరేషన్ చైర్మన్లు, గ్రంథాలయ సంస్థ చైర్మన్, వీసీ పదవులు ఇవ్వాలని అంజన్ కోరారు. రాజీవ్ గాంధీ గురించి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరమని ఆయన ఎద్దేవా చేశారు. రాజీవ్ గాంధీపై కేటీఆర్ చేసిన కామెంట్లపై గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల నాయకులు తిప్పికొట్టాలని అంజన్ కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు.

## నేటి నుంచి కాళేశ్వరంపై ఓపెన్ కోర్టు

(మొదటి పేజీ తరువాయి)

రోజుకు ఇద్దరు, ముగ్గురు చొప్పున.. వారం, పది రోజులు ఓపెన్‌కోర్టు నిర్వహించనున్నారు. ఇప్పటికే కాళేశ్వరం కమిషన్‌కు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మధ్యంతర నివేదిక కూడా అందింది. దాంట్లో వెల్లడైన అంశాలను కూడా క్రాస్ ఎగ్జామిన్‌లో ప్రస్తావించనున్నట్టు తెలిసింది. ఎన్‌డీఎస్ఏ చైర్ పర్సన్‌ను కూడా ఎంక్వైరీకి పిలిచే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. మొదటి రోజు విచారణకు రావాలని మాజీ ఈఎన్సీ మురళీధర్, నాగేందర్ రావును కమిషన్ ఆదేశించింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ... మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్స్‌గా బహిరంగ విచారణ చేయనుంది. ఫైనాన్స్ వ్యవహారాలకు సంబంధించిన విషయంలో విజిలెన్స్ రిపోర్టులో క్లారిటీ లేకపోవడంతో సబ్ కాంట్రాక్టర్లు, బిల్లుల చెల్లింపులు, ఆర్థిక లావాదేవీల అంశాలపై అదనపు సమాచారాన్ని ఇవ్వాలని కమిషన్‌కోరినట్టు తెలిసింది. అదే విధంగా ఇప్పటివరకు అఫిడవిడ్ సమర్పించని మాజీ సీఎస్ సోమేశ్ కుమార్‌కు మరోసారి నోటీసులు ఇచ్చేందుకు కమిషన్ సన్నద్ధమవుతున్నది.

**పంప్ హౌస్ లపైనే ఫోకస్..**

జస్టిస్‌పీసీ ఘోష్‌కమిషన్ కాళేశ్వరం ప్రాజెక్టు పంప్ హౌస్ లపైనే ఫోకస్‌పెట్టింది. పంప్ హౌస్‌ల్లోనే భారీగా అవినీతి, అక్రమాలు జరిగినట్టు ప్రాథమికంగా గుర్తించింది. ఎవరికీ అంతు చిక్కకుండా పంపుల కొనుగోలు వ్యవహారం ఉన్నట్టు కమిషన్ భావిస్తున్నది. ఇందులో మతలబేంటో తేల్చేందుకు క్రాస్‌ఎగ్జామిన్‌లో తనదైన శైలిలో జస్టిస్ పీసీ ఘోష్ ఎంక్వైరీ చేయనున్నట్టు తెలుస్తున్నది. కాళేశ్వరం పంప్‌హౌస్‌ల మునకకు కారణమేంటని కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో పాలు పంచుకున్న ఇంజినీర్లను ఓపెన్‌కోర్టులో తగిన ఆధారాలతో ప్రశ్నించనున్నారు. ప్రతిపాదిత ఫుల్‌రిజర్వాయర్‌లెవెల్ (ఎఫ్ఆర్ఎల్)కు తక్కువ ఎత్తులో పంప్‌హౌస్‌లను ఎందుకు నిర్మించాల్సి వచ్చిందనే కారణాలపై ఇప్పటి వరకు ఎవరెవరు ఏం చెప్పారు ? అనే దానిపై ఎవిడెన్స్ తో సహా ఎంక్వైరీ చేయనున్నారు. పంప్‌హౌస్‌ల నిర్మాణానికి అయిన ఖర్చు, టెండర్ల ప్రక్రియ సాగిన తీరు, పంప్ హౌస్ ల మునగడానికి బాధ్యులెవరనే వివరాలను ఓపెన్‌కోర్టులో రాబట్టాలని చూస్తున్నారు.

## టీడీఎఫ్ లోగో రిలీజ్ చేసిన ఎమ్మెల్సీ కోదండరాం

హైదరాబాద్, ఆగస్టు 21 తెలంగాణ డెవలప్ మెంట్ ఫోరం (టీడీఎఫ్) సిల్వర్ జూబ్లీ లోగోను ఎమ్మెల్సీ కోదండరాం మంగళవారం రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీఎఫ్ ఫౌండర్ ప్రెసిడెంట్ డీపీ రెడ్డి, ఇండియా ప్రెసిడెంట్ మట్టా రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. టీడీఎఫ్ సంస్థ సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించుకోవడం తెలంగాణ ప్రజలందరికీ గర్వకారణమని కోదండరాం అన్నారు. సీఎం రేవంత్ విదేశీ పర్యటనలో ఉన్నప్పుడు ఈ లోగోను ఆవిష్కరించారని టీడీఎఫ్‌యూఎస్ఏ ప్రెసిడెంట్ శ్రీనివాస్, భరత్, శ్రవంత్, శ్రీనాథ్ తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ డెవలప్ మెంట్ ఫోరం (టీడీఎఫ్) ఆవిర్భవించిందని నేతలు డీపీ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. 25 ఏండ్లు పూర్తి చేసుకోవడంతో త్వరలోనే సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నామని చెప్పారు.

## టీచింగ్ హాస్పిటళ్ల నుంచి వీవీపీ డాక్టర్ల బదిలీ

- ఉత్తర్వులు జారీ చేసిన వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్

హైదరాబాద్, ఆగస్టు 21 కొత్త మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్లలో పని చేస్తున్న వైద్య విధాన పరిషత్ డాక్టర్లను, ఆయా హాస్పిటళ్ల నుంచి ట్రాన్స్ ఫర్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. చాలా జిల్లాల్లో వైద్యవిధాన పరిషత్ పరిధిలో పని చేస్తున్న జిల్లా హాస్పిటళ్లనే, మెడికల్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేశారు. వెంటనే డాక్టర్లను నియమించే అవకాశం లేకపోవడంతో, అందులో పని చేస్తున్న వీవీపీ డాక్టర్లను అక్కడే కొనసాగించారు. ఇటీవల జరిగిన ట్రాన్స్ ఫర్లలో కొత్త మెడికల్ కాలేజీలు అన్నింటికీ టీచింగ్ డాక్టర్లను ట్రాన్స్ ఫర్ చేశారు. దీంతో ఆయా హాస్పిటళ్లలో ప్రస్తుతం పనిచేస్తున్న వీవీపీ డాక్టర్లను అక్కడి నుంచి, వీవీపీ పరిధిలో ఉన్న ఇతర హాస్పిటళ్లకు పంపించాలని నిర్ణయించారు. ఏ జిల్లాలోని డాక్టర్లను, అదే జిల్లాలోని హాస్పిటళ్లలో సర్దుబాటు చేయనున్నారు. ఈ బాధ్యతను ఆయా జిల్లా కలెక్టర్లకు అప్పగించారు.



## గంజాయి, సైబర్ క్రైమ్స్, డ్రగ్స్‌పై ఉక్కుపాదం

- నార్కోటిక్స్ విషయంలో సీఎం సీరియస్‌గా ఉన్నారు
- సైబర్ నేరాల కట్టడిలో రాష్ట్రం నెంబర్ వన్
- మీడియాతో డీజీపీ జితేందర్

కరీంనగర్, ఆగస్టు 21 రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ రవాణాతోపాటు సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతున్నామని డీజీపీ జితేందర్ తెలిపారు. నార్కోటిక్స్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ గా ఉన్నారని, డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు సీనియర్ అధికారులతో నార్కోటిక్స్ బ్యూరో టీంను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జోన్ లోని కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల పోలీసు ఉన్నతాధికారులతో మంగళవారం కరీంనగర్ కమిషనరేట్ ఆఫీసులో డీజీపీ క్రైం రివ్యూ మీటింగ్ నిర్వహించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పోలీస్ స్టేషన్లు, యూనిట్ ఆఫీసుల నిర్వహణకు నిధుల కొరత లేదని, అవసరమైతే ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు అడిగి తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో గంజాయి సాగుకు అవకాశం లేదన్నారు. ఆంధ్రా, ఒడిశా, ఇతర రాష్ట్రాల నుంచే రాష్ట్రంలోకి గంజాయి రవాణా అవుతోందని, దీన్ని ఎక్కడికక్కడ అరికడుతున్నామని తెలిపారు. పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నందుకే ఇటీవల భారీగా గంజాయిని పట్టుకోగలిగామని చెప్పారు. రాష్ట్రంలో మావోయిస్టులకు నిధులు, ఆదరణ పెరుగుతున్నాయన్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. ప్రస్తుతం రాష్ట్రంలో మావోయిస్టులు లేరన్నారు. డిపార్ట్ మెంట్ లో సిబ్బంది కొరత కొంత వరకు ఉందని, ఎప్పటికప్పుడు రిక్రూట్మెంట్ చేస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం 13 వేల మంది సిబ్బంది ట్రైనింగ్ లో ఉన్నారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసు గురించి విలేకరులు ప్రశ్నించగా.. ఇప్పుడు ఏమీ చెప్పలేనని, జరుగుతున్న విషయాలన్నీ మీడియాకు తెలుసని దాటవేశారు.

**అభిషేక్ మహంతి బెస్ట్ ఆఫీసర్..**

డిపార్ట్ మెంట్లోని బెస్ట్ ఆఫీసర్లలో కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి ఒకరని డీజీపీ జితేందర్ ప్రత్యేకంగా ప్రశంసించారు. మహంతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎకనమిక్ అఫెన్సెస్ వింగ్ (ఈవోడబ్ల్యూ) పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ గా ఉందని, ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే 1930కి కాల్ చేయవచ్చన్నారు. ఇప్పటికే రూ.85 కోట్లు రికవరీ చేశామన్నారు. ఇందులో కరీంనగర్ కమిషనరేట్ నుంచే రూ.1.7 కోట్ల సొమ్ము రికవరీ అయిందన్నారు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల పోలీసు యంత్రాంగం పనితీరు బాగుందని డీజీపీ సంతృప్తి వ్యక్తం చేశారు.

# ఫ్రీజ్ చేసేలోపే కొట్టేస్తున్నరు

## తెలివిమీరిన సైబర్ నేరగాళ్లు

- డిజిటల్ అకౌంట్స్, క్రిప్టో ఆధారంగా విదేశాలకు సొత్తు
- నిరుడు రాష్ట్రవ్యాప్తంగా 65,877 మోసాలు
- రూ.707 కోట్లలో రూ.114 కోట్లే ఫ్రీజ్
- గోల్డెన్ అవర్స్‌లో 1930కి ఫిర్యాదు చేయాలని పోలీసుల సూచన



హైదరాబాద్, ఆగస్టు 21 సైబర్ నేరగాళ్లు తెలివి మీరుతున్నారు. ఆన్‌లైన్‌లో కొట్టేసిన సొమ్మును పోలీసులు ఫ్రీజ్ చేసేలోపే దేశాలు దాటిస్తున్నారు. పేమెంట్ గేట్‌వేస్, డిజిటల్ అకౌంట్స్, క్రిప్టో ఆధారంగా మనీ లాండరింగ్, వస్తువుల రూపంలో విదేశాలకు తరలిస్తున్నారు. బాధితులు 1930కి కాల్ చేసినా చాలా కేసుల్లో ఫలితం దక్కడం లేదు. ఇలాంటి కేసుల్లో నేరగాళ్లు చిక్కినా క్యాష్ రికవరీ మాత్రం కత్తిమీద సాములా మారింది. ఏటా నమోదవుతున్న సైబర్ నేరాల్లో 10 శాతం మాత్రమే రికవరీ అవుతున్నది. ఇలాంటిదే నిరుడు రాష్ట్రవ్యాప్తంగా 65,877 ఫైనాన్సియల్ ఫ్రాడ్స్ జరగగా రూ.707 కోట్లను సైబర్ నేరగాళ్లు కొట్టేశారు. ఇందులో రూ.114 కోట్లు ఫ్రీజ్ చేయగా రూ.7.30 కోట్లు బాధితులకు రిఫండ్ అయ్యింది. సైబర్ నేరగాళ్లు ఇన్వెస్ట్‌మెంట్, ఆన్‌లైన్ ట్రేడింగ్స్ పేరుతో మోసాలకు పాల్పడతున్నారు. ముఖ్యంగా ఐటీ, కార్పొరేట్ ఉద్యోగులను టార్గెట్ చేసి రూ.కోట్లు కొట్టేస్తున్నారు. తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభాల ఆశ చూపి అందినంత దోచేస్తున్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్, టెలిగ్రాం అడ్డాగా మోసాలకు పాల్పడుతున్నారు. ఇలాంటివే ఈ ఏడాది మార్చి నుంచి ఆగస్ట్ 10 వరకు రాష్ట్రంలో నమోదైన కేసుల్లో రూ.250 కోట్లు సైబర్ నేరగాళ్లు కొట్టేశారు. 1930కి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా రూ.97.18 కోట్లను సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఫ్రీజ్ చేశారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించి బాధితులకు డబ్బు రిఫండ్ చేశారు.

**ఇంటర్నేషనల్ సైబర్ ముఠాల స్కెచ్**

దుబాయి, కంబోడియా, థాయ్‌లాండ్, హాంకాంగ్ ప్రస్తుతం సైబర్ నేరగాళ్లకు అడ్డాలుగా మారాయి. ఇండియన్ బ్యాంక్ అకౌంట్స్, ఫోన్ నంబర్స్ కోసం నేరస్తులు ప్రత్యేక నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నారు. చైనీయులు రూపొందించిన యాప్స్‌తో వరుస మోసాలకు పాల్పడుతున్నారు. ఆన్‌లైన్‌లో కొట్టేసిన డబ్బును క్రిప్టో కరెన్సీ రూపంలో దేశం దాటిస్తున్నారు. వస్తువులు కొనుగోలు చేసి సొంత దేశాల్లోని కుటుంబ సభ్యులకు ఎగుమతి చేస్తున్నారు. దేశంలోనే ఉండి సైబర్ నేరాలకు పాల్పడుతున్న నైజీరియన్లు.. ఢిల్లీ, ముంబై, సూరత్ లాంటి ప్రాంతాల్లో హోల్‌సేల్‌గా బట్టలు కొనుగోలు చేస్తున్నారు. వాటిని షిప్ యార్డ్‌ల నుంచి కన్‌సైన్‌మెంట్ పార్సిల్ రూపంలో నైజీరియాకు తరలిస్తున్నారు. స్థానిక హోల్‌సేల్ మార్కెట్లలో ఆ సరుకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

**కంపెనీల పేరుతో కరెంట్ అకౌంట్స్**

ఆన్‌లైన్ అడ్డాగా సాగుతున్న ఇలాంటి నేరాల్లో బాధితులు పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేకుండా పోతోంది. ఇందుకు కారణం గోల్డెన్ అవర్స్‌లో బాధితులు 1930కి కాల్ చేయకపోవడం సైబర్ నేరగాళ్లకు అవకాశంగా మారింది. దోచుకున్న సొమ్ము పోలీసులకు చిక్కకుండా సైబర్ నేరస్తులు జాగ్రత్త పడుతున్నారు. ఫేక్ ఫోన్ నంబర్లు, ఫేక్ బ్యాంకు ఖాతాలతో పోలీసులకు సవాళ్లు విసురుతున్నారు. లోకల్ ఏజెంట్స్, కంపెనీల పేరుతో కరెంట్ అకౌంట్స్ కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే దోచుకున్న డబ్బును డిజిటల్, వర్చువల్ ఖాతాలతో ఖాళీ చేస్తున్నారు. దీంతో ఏజెంట్లు అరెస్ట్ అవుతున్నారు తప్ప అసలు నేరస్తుల జాడ లభించడం లేదు.

# రిజిస్ట్రేషన్ శాఖలో పనిచేయని బాబు గుడ్ గవర్నెన్స్!

- ట్రాన్సఫర్లతో రిజిస్ట్రేషన్ శాఖలో మ్రోగిన అవినీతి నగారా
- అత్యంత అవినీతి మయమైన శాఖగా బహిరంగ గుర్తింపు!
- గగ్గోలు పెడుతున్న కక్షిదారులు - కోట్లు సంపాదిస్తున్న మధ్యవర్తులు, దళారులు, ఉద్యోగస్తులు.
- నిబంధనలకు విరుద్ధంగా కార్యాలయ విధుల్లో ప్రైవేటు వ్యక్తులు.
- లోపిస్తున్న అజమాయిషీ తీసుకుంటున్న చర్యలు శూన్యం



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ )** రిజిస్ట్రేషన్ శాఖ అవినీతికి పరాకాష్టగా మారింది. రియల్ ఎస్టేట్ భూమ్ రాష్ట్రంలో ఊపందుకున్న నేపథ్యంలో కక్షిదారులు తమ క్రయవిక్రయాలను తప్పనిసరిగా నమోదు చేసుకునే పరిస్థితి దృష్ట్యా రిజిస్ట్రేషన్ సిబ్బంది పంట పండింది. రిజిస్ట్రేషన్ శాఖ చట్టాలు, వారసత్వ చట్టాలు, వాటి పనితీరు ప్రజలకు కొరగాని కొయ్యి, ఆ చట్టాలు అర్థం చేసుకోలేక, ఒకవేళ నేరుగా దస్తావేజును నమోదు చేసుకున్నేందుకు కక్షిదారు కార్యాలయానికి వెళ్లిన, పర్సంటేజ్ ముట్ట చెప్పనదే పని జరగదు. భూమి అంటే ఒక సెంటిమెంట్. పదికాలాలపాటు జాగ్రత్త చేసుకోవాలని భూములను రిజిస్ట్రేషన్ చేయించుటకు రిజిస్ట్రేషన్ శాఖను ఆశ్రయిస్తారు. ఆ శాఖకు ఇదే పెద్ద వరం, ఒక్కొక్క తరహా రిజిస్ట్రేషన్ కు ఒక్కొక్క రేటు నిర్ణయించి పర్సంటేజీలు వారీగా మధ్యవర్తులు, దళారులను ప్రోత్సహిస్తూ ప్రైవేటు వ్యక్తుల ద్వారా నిబంధనలకు విరుద్ధంగా కార్యాలయాల్లో వారికి వారే నియమించుకుని వారి ద్వారా మూడో కంటికి తెలియకుండా బహిరంగంగానే అవినీతికి పాల్పడుతూ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు, ఉద్యోగస్తులు, దళారీలు, మధ్యవర్తులు, కక్షిదారులను నిలువు దోపిడీ చేస్తూ కోట్లు సంపాదిస్తున్న అవినీతి నిరోధక శాఖ ఎక్కడ కూడా వీరిని అదుపులో తీసుకుని వీరిపై ఎక్కడ చర్యలు తీసుకోవడం లేదు. ఉద్యోగస్తులు నిబంధనలను అడ్డుపెట్టుకుని సస్పెండ్ అయిన హాఫ్ పే శాలరీ అందుతుంది, ఆ తర్వాత ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుని ఎక్కడో చోట ఉద్యోగం చేసుకోవచ్చు, మరలా కోట్లు సంపాదించుకోవచ్చునే లోపాయికారి అవకాశాలతో శాఖను అవినీతిమయం చేశారు. శాఖకు ప్రభుత్వ ఇచ్చిన లక్ష్యాలతో ఎక్కువ రిజిస్ట్రేషన్ అయ్యే కార్యాలయాలు, ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే కార్యాలయాలను బదిలీ సమయాల్లో ఎంచుకునేందుకు ఎ, బి, సి కేటగిరీలుగా విభజించుకుని, ఆయా కేటగిరీని బట్టి ఉద్యోగ స్థాయిని బట్టి 50 లక్షలు, 20 లక్షలు, 10 లక్షలుగా ముడుపులు మొట్ట చెప్పి ఆయా స్థానాల్లో బదిలీలు వేయించుకుని చిన్న స్థాయి ఉద్యోగి సైతం నెలకి లక్షల్లో సంవత్సరానికి కో కోట్లల్లో అవినీతి సంపాదనే ధ్యేయంగా పనిచేస్తారు. రాష్ట్రాల్లో బదిలీలకు తెర తీసిన వేళ, ఇక అవినీతి వేలంకు నగారా మోగినట్లయితే రిజిస్ట్రేషన్ శాఖలో. ఉన్నతాధికారులకు భారీగానే కోట్లు లక్షలలో ఉద్యోగులు ముడుపులు ముట్ట చెబుతున్నారంటే, ఆ శాఖలో అవినీతి బలంగా ఎంత వెళ్ళున్నుకుందో అర్థమవుతుంది. ఫిర్యాదు చేస్తేనే పనిచేసే అవినీతి నిరోధక శాఖ వ్యవస్థ మొద్దు నిద్ర వీడితేనే, శాఖల్లో స్వతంత్రంగా ప్రతి శాఖను క్షుణ్ణంగా పరిశీలించేందుకు పారదర్శకమైన మూడవ వ్యవస్థ ప్రభుత్వం వద్ద ఉంటే గాని ప్రభుత్వ శాఖల ఉద్యోగస్తులు చేస్తున్న అవినీతి అక్రమాలు బయటపడవు. అప్పనంగా వచ్చి పడుతున్న అవినీతి డబ్బుతో కోట్లు కూర్చుంటూ, బినామీ పేర్లతో ఉద్యోగస్తులు, దళారులు మధ్యవర్తులు కోట్లు కొల్లగొడుతున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రవేట్ ఫైనాన్స్ సంస్థలు లక్ష్యాలను పూర్తి చేసుకునేందుకు ఉద్యోగస్తులు మధ్యవర్తులతో కుమ్మక్కై రిజిస్ట్రేషన్ అవ్వని ప్రభుత్వ పట్టా స్థలాలకు సంబంధిత సర్వే నెంబర్ కాకుండా, అదే స్థలానికి రిజిస్ట్రేషన్ అయ్యే సర్వే నెంబరు దాఖలు చేసి రిజిస్ట్రేషన్ చేస్తున్న, వారిపై ఎలాంటి చర్యలు తీసుకునేందుకు , అలాంటి రిజిస్ట్రేషన్ కనిపెట్టేందుకు ఎటువంటి వ్యవస్థ ప్రభుత్వం వద్ద లేనందున ఇలాంటి మోసాలకు తెగబడుతూ అక్రమంగా వినియోగదారులను మోసం చేస్తూ కోట్లు సంపాదిస్తున్నారు. తర్వాత ప్రజలు కోర్టులు చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పాలవుతున్నారు. శాఖలో పారదర్శకమైన వ్యవస్థను ప్రభుత్వం తీసుకు వస్తున్న ఉద్యోగస్తుల అవినీతి దారులు విభిన్న రూపంలో చట్టానికి దొరక్కుండి అక్రమంగా బినామీ పేర్లతో సంపాదిస్తూనే ఉన్నారు.

భూముల క్రయ విక్రయాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి కాబట్టి, ప్రభుత్వం ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ శాఖ మార్కెట్ రేటు కన్నా బహిరంగ మార్కెట్లో రేటును బట్టి భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి అదే ప్రభుత్వం నిర్ణయించిన రిజిస్ట్రేషన్ భారాన్ని కూడా భరిస్తూ, ఈ శాఖ ఉద్యోగస్తులకు ఏర్పాట చేసుకున్న మరో మూడో వ్యవస్థ అయిన మధ్యవర్తులకు దళారీలకు తప్పనిసరిగా పర్సంటేజీల రూపంలో భారీ మూల్యం చెల్లించుకుంటూ దగా పడుతున్నాడు. కక్షిదారులకు అర్థమయ్యే రీతిగా రిజిస్ట్రేషన్ చట్టాలు, విధి విధానాలు రూపొందించవలసిన బాధ్యత, ప్రభుత్వ కార్యాలయంలో ఎక్కడ అవినీతిమయం కాకుండా లోపాయికారి విధానాలను సరిదిద్ది, ప్రక్షాళన చేయవలసిన అవశ్యకత ప్రభుత్వానికి ఉంది, వ్యవస్థ పారదర్శంగా ఉంటేనే శాఖలో అవినీతి తగ్గుతుంది. అత్యంత అవినీతిమయంగా బహిరంగానే కనబడుతున్న ఆ శాఖ, ఎప్పటికప్పుడు అవినీతి చేయడంలో దారులు వెతుక్కుంటూ క్రొత్త పుంతలు తొక్కుతున్న, లోపాయి కారి వ్యవస్థ వల్ల నియంత్రించలేని చేతకానితనంతో ప్రభుత్వం చేష్టలుడిగి చూడడం తప్ప ఏమి చేయలేక మిన్న కుండిపోయింది.

ఈ వ్యవస్థపై దృష్టి సారించి, పటిష్ట మైన వ్యవస్థను రూపొందించి చిత్త శుద్ధితో సమూల ప్రక్షాళన చేయవలసిన అవశ్యకత ఎంతైనా ఉంది. అత్యంత భయంకరంగా బహిరంగని అవినీతి చేస్తున్న ఈ శాఖను అవినీతి రహితంగా చేసి మరింత పారదర్శంగా ప్రభుత్వ ప్రజల చేరువ చేసే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలుడు ఘటనపై సీఎం తీవ్ర దిగ్భ్రాంతి



- జిల్లా కలెక్టర్ తో ఫోన్ లో మాట్లాడిన ముఖ్యమంత్రి
- బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం సెజ్ లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలుడు ఘటనలో 7 గురు ప్రాణాలు కోల్పోవడం పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది అనే సమాచారం పై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాద ఘటన, బాధితులకు అందుతున్న సాయంపై ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్ తో ఫోన్ లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనలో 7 గురు చనిపోగా... 30 మందికిపైగా తీవ్రంగా గాయపడి వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని జిల్లా అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. చికిత్స పొందుతున్న వారి ప్రాణాలు కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఉన్నతాధికారులను, పరిశ్రమల శాఖ అధికారులను అక్కడే ఉండి పూర్తి స్థాయి సహాయక చర్యలు చేపట్టాలని సీఎం అదేశించారు.

## వైసీపీ రౌడీల బారి నుంచి రక్షణ కల్పించండి..



- వైసీపీ రౌడీలు గొంతుపై కత్తిపెట్టారు..!!
- ఇంటిని, పొలాన్ని కబ్జా చేశారు..
- ప్రజా దర్బార్ లో మంత్రి నారా లోకేష్ కు విన్నపాల వెల్లువ..

**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** వైసీపీ రౌడీలు తన గొంతుపై కత్తిపెట్టి ఇంటిని, పొలాన్ని కబ్జా చేశారని గుంటూరు జిల్లా తెనాలికి చెందిన రిటైర్డ్ రైల్వే డ్రైవర్ పిల్లి అబ్రహాం, కుమార్తె పిల్లి సుధారాణి మంత్రి నారా లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. వైసీపీ నేత, దుగ్గిరాల జడ్పీటీసీ దాసరి వీరయ్య, అతని అనుచరులైన రౌడీషీటర్, తెనాలి వన్ టౌన్ వైసీపీ కౌన్సిలర్ గెడ్డేటి సురేంద్ర, గెడ్డేటి బాలయ్య, రౌడీషీటర్ మహంకాళి, పిల్లి తిరుపతయ్య, మహేష్ లు కలిసి వేధిస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. వృద్ధుడినైన తనపై దాడిచేసి చంపుతామని బెదిరిస్తున్నారని, ఇంటిని ధ్వంసం చేసి బయటకు గెంటేశారని వాపోయారు. దిక్కుతోచని స్థితిలో పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదన్నారు. పలు భూకబ్జాలు, హత్యలు, సెటిల్ మెంట్ల కేసుల్లో ముద్దాయిలైన వైసీపీ రౌడీల బారి నుంచి ప్రాణరక్షణ కల్పించి, తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేష్ ఆదేశించారు.

## ఎంఎల్సీగా బొత్స సత్యనారాయణతో ప్రమాణం చేయించిన కౌన్సిల్ చైర్మన్



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలి సభ్యునిగా ఇటీవల ఎన్నికైన మాజీమంత్రి బొత్స సత్యనారాయణచే బుధవారం రాష్ట్ర శాసన మండలి అధ్యక్షులు కొయ్యే మోషేన్ రాజు వారి చాంబరులో బొత్సతో ఎంఎల్సీగా ప్రమాణం చేయించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర శాసన సభ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర, సంయుక్త కార్యదర్శి యం.విజయరాజు పాల్గొన్నారు.

## అక్షయపాత్రను సందర్శించిన కలెక్టర్ నాగలక్ష్మి



**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** మంగళగిరిలోని హరే కృష్ణ మూమెంట్ ద్వారా నడపబడుతున్న అక్షయ పాత్ర కేంద్రీకృత వంటశాలను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ బుధవారం సందర్శించారు.

ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజనం, అన్న క్యాంటీన్లకు అక్షయపాత్ర నుండి సరఫరా అవుతున్న టిఫిన్, భోజన తయారీని పరిశీలించారు.

టిఫిన్లకు, భోజనాలకు వినియోగించే కూరగాయలు, ఆహార పదార్థాలు, తయారీ, భోజనశాల పనితీరు వివరాలను కలెక్టర్ నాగలక్ష్మి అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## కన్నయ్య నాయుడుని సన్మానించిన సీఎం చంద్రబాబు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ప్రముఖ సాగునీటి రంగ నిపుణులు, రిటైర్డ్ అధికారి కన్నయ్య నాయుడుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సన్మానించారు. వెలగపూడి సచివాలయంలో కన్నయ్య నాయుడుకి శాలువా కప్పి జ్ఞాపిక అందించి అభినందించారు. వరద పోటుతో ఇటీవల తుంగభద్ర జలాశయ 19వ గేటు కొట్టుకపోయింది. విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు సమస్యను పరిష్కరించేందుకు కన్నయ్య నాయుడికి ఫోన్ చేసి అక్కడకు వెళ్లాలని కోరారు. పరిస్థితిని గాడిన పెట్టేందుకు ఎంతో శ్రమించిన కన్నయ్య నాయుడు వరద ప్రవాహం ఉధృతంగా కొనసాగుతున్న సమయంలోనే ఏపీ, కర్నాటక అధికారుల సహకారంతో స్టాప్ లాగ్ గేటు విజయవంతంగా అమర్చారు. దీంతో సుమారు 30 టీఎంసీల నీరు వృధా కాకుండా అడ్డుకోగలిగారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం కన్నయ్య నాయుడిని ప్రత్యేకంగా పిలిపించుకుని మాట్లాడారు. ప్రాజెక్టులో నీరు ఉండగానే స్టాప్ లాక్ గేటు అమర్చి నీరు వృధా కాకుండా రైతాంగానికి ఎంతో మేలు చేశారని ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర రైతాంగం తరపున కన్నయ్య నాయుడుకి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న మంత్రి కొల్లు రవీంద్ర



**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్ ) :** సింహాచలం అప్పన్న స్వామిని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన మంత్రికి ఆలయ ఈవో, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కప్పస్తంభం ఆలింగనం, గర్భగుడిలో మంత్రి కొల్లురవీంద్ర ప్రత్యేక పూజలు చేసి.. ఆపై వేదాశీర్వచనం పొందారు. దర్శనానంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. సింహాద్రి అప్పన్న ఎంతో మహిమాన్వితం కలిగిన దేముడన్నారు. రాష్ట్ర ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ప్రజలు ఎంత ఇబ్బంది పడ్డారో చూశామన్నారు. ప్రజల కోరిక మేరకు సంక్షేమ పథకాలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ముందుకొచ్చారని తెలిపారు. రాష్ట్రంలో ఐదు సంవత్సరాలలో అన్ని వర్గాలు ఇబ్బంది పడ్డారన్నారు. పరిశ్రమలు రాకుండా అడ్డుకున్నారని.. ఉన్న పరిశ్రమల్ని మూసేశారని మండిపడ్డారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు ఇన్వెస్ట్‌మెంట్ పెట్టడానికి పెద్ద సంస్థలు వస్తున్నాయన్నారు. విశాఖపట్నంలో కొండలని, గనులను, భూములను దోచుకున్నారని ఆరోపించారు. రుషికొండలో ప్రజల సొమ్ముతో ప్యాలస్‌లు కట్టుకున్నా రన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను మొదటి తేదీన అందిస్తున్నా మన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ఐదు సంవత్సరాలలో అనేక పరిశ్రమలు వస్తాయని స్పష్టం చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సంబంధించి అన్ని సమకూరుతాయని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## సీకే గరల్స్ హైస్కూల్ కు సురక్షిత త్రాగునీటి ప్లాంట్

- రూ.2.50 లక్షలతో సమకూర్చిన మంగళగిరి రోటరీ క్లబ్
- ఆర్ఐడీ 3150 గవర్నర్ నామినీ ఉదయ్ పిలానిచే ప్రారంభోత్సవం



**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** మంగళగిరి రోటరీ క్లబ్ సీకే గరల్స్ హైస్కూల్ లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినుల కోసం సురక్షిత తాగునీటి ప్లాంట్ ను రూ. 2.50 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసింది. సీకే ఉన్నత పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయినుల అభ్యర్థన మేరకు మంగళగిరి రోటరీ క్లబ్ ఈ సర్వీసు ప్రాజెక్టును అనతి కాలంలోనే చేపట్టింది.

ఈ మేరకు బుధవారం ఉదయం రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ నామినీ (2026-27) ఉదయ్ పిలాని ముఖ్యఅతిథిగా విచ్చేసి వాటర్ ప్లాంట్ ను ప్రారంభోత్సవం చేశారు.

ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ క్లబ్ అడ్మినిస్ట్రేషన్ కౌన్సెలర్ పీడీజీ అన్నె రత్నప్రభాకర్, డిస్ట్రిక్ట్ పబ్లిక్ ఇమేజ్ కో చైర్మన్ అనిల్ చక్రవర్తి ఇసునూరు, సీకే గరల్స్ హైస్కూల్ ప్రెసిడెంట్ చింతక్రింది కల్యాణ్ కుమార్, సెక్రటరీ వింజమూరి వినయ్ కుమార్, ఇన్ చార్జి ప్రధానోపాధ్యాయిని వుద్దంటి తనూజ, మంగళగిరి రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గాజుల శ్రీనివాసరావు, సెక్రటరీ అందె మురళీమోహన్, ట్రెజరర్ వడ్లమూడి శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ వంశీకృష్ణ మాజేటి, సర్వీసు ప్రాజెక్టు డైరెక్టర్ కాపరౌతు సుందరయ్య, పలువురు రొటేరియన్లు పాల్గొన్నారు.

అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథి ఉదయ్ పిలాని మాట్లాడుతూ మంగళగిరి రోటరీ క్లబ్ అనతికాలంలోనే స్ఫూర్తిదాయక సర్వీసు ప్రాజెక్టులను చేపడుతుండడంపై సంతోషం వ్యక్తం చేశారు. సీకే విద్యాసంస్థల యాజమాన్యం అభ్యర్థనలను పరిగణించి, రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 తరపున మరిన్ని సర్వీసు ప్రాజెక్టులు చేపడతామని భరోసాఇచ్చారు.


పీడీజీ అన్నె రత్నప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థినులు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆ పరిస్థితుల్లో చదువు కూడా ఆహ్లాదకరంగా సాగుతుందన్నారు.

అనిల్ చక్రవర్తి మాట్లాడుతూ రోటరీ ఇంటర్నేషనల్ 119 సంవత్సరాలుగా సేవలందిస్తోందని, 200 దేశాల్లో పనిచేస్తోందని విద్యార్థినులకు వివరించారు.

మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు మాట్లాడుతూ సీకే గరల్స్ హైస్కూల్ విద్యార్థినులకు సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో స్వల్పకాలంలోనే వాటర్ ప్లాంట్ ను ఏర్పాటుచేశామని చెబుతూ మరిన్ని సర్వీసు ప్రాజెక్టులు చేపడతామని వివరించారు.

సీకే గరల్స్ హైస్కూల్ ప్రెసిడెంట్ కల్యాణ్ కుమార్, ఇన్ చార్జి హెచ్ఎం తనూజ తాము అడిగిందే తడువుగా మంగళగిరి రోటరీ క్లబ్ ముందుకు వచ్చి సురక్షిత వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిందని. అలాగే పాఠశాల ఆవరణలో పచ్చదనం పెంపొందించేందుకు ఇటీవలే 90 మొక్కలు నాటడం జరిగిందని ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

## సూపర్ సిక్స్ పథకాల అమలు ఎప్పుడు : తులసి రెడ్డి



**శ్రీకాళహస్తి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** శ్రీకాళహస్తి పట్టణానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు తులసి రెడ్డి బుధవారం విచ్చేసినారు. వీరికి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తయ్య నాయుడు స్వాగతం పలికారు. అనంతరం విలేకరుల సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ పథకాల అమలు ఎప్పుడు చేస్తుందని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఎరువుల వినియోగంపై శిక్షణ కార్యక్రమం




- డాట్ సెంటర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్. వెంకటలక్ష్మి

**గుంటూరు, పెదకాకాని ( జర్నలిస్ట్ ఫైల్):** సాయిల్ (ఎస్ హెచ్ సి)హెల్త్ కార్డు ఆధారంగా వరి పంటలో నత్రజని,భాస్వరం పొటాషియంల ముఖ్య పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలైన జింక్,ఐరన్, సల్ఫర్,కాల్షియం,మెగ్నీషియం, మాంగనీస్,అయోడిన్ మొదలైన వాటిని అందించాలని డాట్ సెంటర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నంబూరు గ్రామంలో వ్యవసాయ సాంకేతిక సంస్థ గుంటూరు వారి ఆధ్వర్యంలో రైతుకు భూసార పరీక్ష( కార్డు) పత్రం ఆధారంగా రసాయనక ఎవరు వినియోగం అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచారకులు ఎం. హైమావతి మాట్లాడుతూ ఇనుప ఇనుప దాతులోపం వల్ల ఆకులు తెల్లగా మారిపోతాయని దానిని నివారణగా అన్నబేది 5 గ్రా. నీటిలో నిమ్మ ఉప్పు2 గ్రా. నీటిని చొప్పున కలుపుకొని పిచికారి చేసుకోవాలని రైతులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. భూమిలో మొక్కకు అందుబాటు స్థితిలో మార్చి అందించడానికి జీవన ఎరువైన పాస్ఫో బ్యాక్టీరియాను ఎకరానికి 2 కేజీల చొప్పున పశువుల ఎరువులతో కలిపి చల్లుకోవాలన్నారు. జీవన ఎరువులకు రసాయనక ఎరువులతో కలిపి వాడరాదని, సేంద్రియ ఎరువులతో మాత్రమే వాడాలి అన్నారు. ప్రతి రైతు సేంద్రీయ ఎరువులను కూడా వాడాలని, నత్రజని ఎరువును చిరు పొట్ట లోపే వాడాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఆర్. వి. శివాజీ, వి ఏ ఏ లు బి. బాబురావు,భవాని, టి.త్రివేణి,ఎం. హేమంత్ పాల్గొన్నారు.

## ఘనంగా శివుని విగ్రహ వార్షికోత్సవం



**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం రథశాల వద్ద 51 అడుగుల పరమశివుని విగ్రహం మూడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విగ్రహ దాతలు మాదాల వెంకటేశ్వరరావు, శ్రీమతి అంజమ్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. అన్నదాన కార్యక్రమాన్ని విగ్రహ మాదల వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ బోగి కోటేశ్వరరావు, బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షులు తుళ్ళిమిల్లి రామకృష్ణ, భక్త బృందం ప్రతినిధులు మాదాల గోపికృష్ణ, నిరీష, వెంకటకృష్ణ, రమ్య మాధురి, సారమేకల యేసుబాబు, తుళ్ళిమిల్లి గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467